




www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
23-06-2024

సంపుటి : 01 | సంచిక : 50 | పేజీలు : 12 | వెల : 5/-   తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



V3 NEWS


## వచ్చే నెల నుంచే రైతు రుణమాఫీ

- రైతులకు వందశాతం రుణమాఫీ చేస్తాం
- ప్రతిపక్షాలు ఓర్వలేకనే ఆరోపణలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



2

## వెంకట్రామిరెడ్డి మోసాలు బయటపెడతా..

- ధరణి పేరుతో భూముల కబ్జాలు
- గిరిజనులను బెదిరించి భూములు లాక్కున్నారు
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన ఆరోపణలు

ఇందిరమ్మ గెలిచిన నియోజక వర్గం, కేసీఆర్ పుట్టిన ఇల్లు అయిన మెదక్ నియోజకవర్గంలో తాను గెలవడం చారిత్రాత్మకమని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మొదట కలెక్టర్‌గా చేసి అనంతరం ప్రజాప్రతినిధిగా మారిన వెంకట్రామిరెడ్డి ధరణి పేరుతో చేసిన మోసాలు బయటపెడతానని చెప్పారు.



2



## ప్రధాన ప్రతిపక్ష నేత హోదా గల్లంతు?

### రేవంత్‌తో కేసీఆర్‌కు పొంచి ఉన్న ప్రమాదాలు

- శాసన సభ, మండలిలో పైచెయ్యి సాధించేలా స్కెచ్
- ప్రధాన ప్రతిపక్షనేత హోదా ఊడబీకేలా వ్యూహం
- టార్గెట్ 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా ప్రణాళిక
- నాటి కేసీఆర్ వ్యూహాన్నే అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి
- ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేల చేరిక.. మరో 20 మంది క్యూలో..
- బీఆర్ఎస్ ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం చేసే దిశగా అడుగులు

చట్టసభల్లో కేసీఆర్‌కు చాలాప్రమాదాలు పొంచున్నాయనే సంకేతాలు కనబడుతున్నాయి. కేసీఆర్ విషయంలో అధికారపార్టీ టార్గెట్ ఏమిటంటే అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కనీయకూడదని. 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున 39 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. దీంతో కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్షనేత హోదా దక్కింది. ఈ హోదాను కూడా ఊడపెరికేయాలన్నది రేవంత్ రెడ్డి టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

**విశ్వంభర, హైదరాబాద్ :** అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా అంటే కేబినెట్ ర్యాంకుతో సమానం. ప్రభుత్వానికి సంబంధించిన ప్రోటోకాల్ వ్యవహారాల్లో ముఖ్యమంత్రి తర్వాత ప్రధాన ప్రతిపక్ష నేతే వస్తారు. ఆ తర్వాతే మంత్రులు, మిగిలిన వాళ్ళు. తెలంగాణా అసెంబ్లీలోని 119 సీట్లలో 10 శాతం సీట్లు దక్కించుకున్న పార్టీ అధినేతకు ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కుతుంది. 119 సీట్లలో 10 శాతం అంటే 11.9 సీట్లు. 11.9 సీట్లను లెక్కేయటం సాధ్యంకాదు కాబట్టి 12 సీట్లని లెక్కవేస్తారు. ఈ లెక్కన బీఆర్ఎస్ 39 సీట్లలో గెలిచింది. అందుకే కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కింది. ముందే చెప్పుకున్నట్లు ప్రధాన ప్రతిపక్ష హోదాతో కేసీఆర్‌కు కేబినెట్ మంత్రి ర్యాంకుంది. ఈ కారణంగా ప్రభుత్వం పరంగా కారు డ్రైవర్, అటెండర్లు, ఇంటి అద్దె లాంటి అనేక సౌకర్యాలున్నాయి. ఇవేవీ ఉండకుండదంటే ప్రధాన ప్రతిపక్ష


మిగతా2లో...


## చంద్రబాబుతో పోటీపడత..

### ఇకపై నేను, అధికారులు 18 గంటలు పని చేస్తాం

- అభివృద్ధి, సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు పోటీపడాలి
- వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేస్తా
- ప్రపంచ దేశాల నుంచి ఎవరు వచ్చినా వైద్యం అందాలి
- బసవతారకం ఆస్పత్రికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- క్యాన్సర్ ఆస్పత్రి 24వ వార్షికోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 24వ వార్షికోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్, ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబులను గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ ఆలోచనతో ఏర్పడ్డ ఈ ఆసుపత్రి 24ఏళ్లుగా కోట్లాది మందికి సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఈ ఆసుపత్రి నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఆలోచన విధానాలను కొనసాగించాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు


మిగతా2లో...


## రాష్ట్రాన్ని తాకట్టుపెట్టేందుకు యత్నం

### తెలంగాణలో బొగ్గు అమ్మకాలను బీఆర్ఎస్ వ్యతిరేకించింది

- సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేయాలని కాంగ్రెస్ కుట్ర
- అన్ని రంగాల్లో ప్రజలను ద్రోహం చేస్తున్న కాంగ్రెస్
- సరైన సమయంలో ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయం
- మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయని మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఆయన శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. రేవంత్ అబద్ధాలు చూసి తన సమాధిలో గోబెల్స్ ఉలిక్కిపడ్డారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో బొగ్గు బ్లాకుల అమ్మకాలను బీఆర్ఎస్


మిగతా2లో...



## సింగరేణిపై బీఆర్ఎస్‌ది విచిత్ర వాదన

### సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచన కేంద్రానికి లేదు

- అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే..
- సింగరేణిని ఇష్టానుసారంగా దోచుకున్న బీఆర్ఎస్ నేతలు
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



2




## రాష్ట్రాల అభివృద్ధికి తోడ్పాటు

- బ్యార్టీ కార్లకు నో జీఎస్టీ
- చిరు వ్యాపారులకు మేలు చేసేలా నిర్ణయాలు
- 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్మలా సీతారామన్ ప్రకటన
- తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవ్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది.. రాష్ట్రాల ఆర్థికశాఖ మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఏపీ నుంచి పయ్యావుల కేశవ్ , తెలంగాణ నుంచి భట్టి విక్రమార్క ఈ సమావేశానికి హాజరయ్యారు.

9

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 125 | ₹ 147 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 213 | ₹ 243 |

## నీట్ వివాదంపై ఉన్నతస్థాయి కమిటీ

- ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కమిటీ
- రెండు నెలల్లోగా కేంద్ర విద్యాశాఖకు నివేదిక
- ప్రకటించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

9

## కేసీఆర్‌ను సీఎం చేయడమే మా లక్ష్యం

- బీఆర్ఎస్ పార్టీ మారే ప్రసక్తే లేదు
- ఎన్నికల్లో ఓటమిపై సమీక్షించుకుంటున్నాం
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

2

## సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ

- కాంగ్రెస్‌ను నమ్మిన నిరుద్యోగులు రోడ్డున పడ్డారు
- గ్రూప్ 1, డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
- కేబినెట్ భేటీలో నిరుద్యోగుల గురించి చర్చించారా..?
- లేఖలో ప్రశ్నించిన మాజీ మంత్రి హరీష్ రావు

2

## పంటల సాగు చేసేదెలా?

### తెలంగాణలో అడుగంటిన ప్రాజెక్టులు

- వర్షాకాలంలో జాడలేని చినుకులు
- బోసిపోయిన కృష్ణా, గోదావరి నదులు
- ఎగువ నుంచి ప్రారంభం కానీ వరద
- గతేడాది నీళ్లు రాక ఎండిపోయిన ప్రాజెక్టులు
- సాగునీరే కాదు.. తాగునీటికి కటకటే..
- వర్షా ల కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతో వర్షాకాలంలోనూ అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులలోకి గత సంవత్సరం వరదనీరు చేరలేదు. దీంతో ఈ సంవత్సరం ప్రాజెక్టు జలాశయాలు అడుగంటాయి. రాష్ట్రంలో వర్షాకాలం రుతుపవనాలు వచ్చినా ఆశించిన మేర వర్షాలు కురవక ఖరీఫ్ కార్యకలాపాలు అనిశ్చితంగా మారాయి. రుతుపవనాల ముందుగా వచ్చినా కొంత విరామం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణకేంద్రం తెలిపింది.


మిగతా2లో...

# సింగరేణిపై బీఆర్ఎస్‌ది విచిత్రమైన వాదన

**విశ్వంభర, హైదరాబాద్ :** సింగరేణి బొగ్గు గనుల వేలంపై కాంగ్రెస్.. బీజేపీ.. బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలం వేయడం, కాంగ్రెస్ ప్రభుత్వం వేలంలో పాల్గొనడం పై బీఆర్ఎస్ పార్టీ.. బీజేపీ, కాంగ్రెస్ టార్గెట్ విమర్శలు సంధిస్తోంది.. దీనిపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. సింగరేణిపై బీఆర్ఎస్ విచిత్రమైన వాదన చేస్తోందంటూ మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిని ఇష్టానుసారంగా దోచుకున్నారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. రాజకీయ జోక్యంతో సింగరేణిని పూర్తిగా విధ్వంసం చేశారని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచన కేంద్రానికి లేదని.. ఇదే విషయాన్ని ప్రధాని మోదీ గతంలో చెప్పారని గుర్తు చేశారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. వెంటనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు కిషన్ రెడ్డి. అవినీతి విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే అని మండిపడ్డారు.సింగరేణి వ్యవస్థను బీఆర్ఎస్ హయాంలో ధ్వంసం చేశారని.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేనాటికి.. సింగరేణి బ్యాంక్ ఖాతాలో రూ. 3500 కోట్లు ఉండేవన్నారు. 2014కు ముందు సింగరేణిలో ఉద్యోగుల జీతాలు.. ఆలస్యంగా ఇచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. సింగరేణిని కేసీఆర్ అప్పులపాలు చేశారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణికి రూ. 30 వేల కోట్లు చెల్లించాల్సి ఉంది.. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ సంస్థలకు సకాలంలో చెల్లింపులు చేయలేదన్నారు. ఈ కారణంగా సింగరేణికి బకాయిలు పేరుకుపోయాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని.. బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా సింగరేణిని దోచుకున్నారంటూ ఆరోపించారు. సింగరేణిలో గతంలో విస్తృతంగా పర్యటించానని.. కేసీఆర్ కుటుంబం సింగరేణిని రాజకీయ క్షేత్రంగా ఉపయోగించుకున్నారంటూ విమర్శించారు.

## వెంకట్రామిరెడ్డి మోసాలు బయటపెడతా..

**విశ్వంభర, హైదరాబాద్ :** ఇందిరమ్మ గెలిచిన నియోజక వర్గం, కేసీఆర్ పుట్టిన ఇల్లు అయిన మెదక్ నియోజకవర్గంలో తాను గెలవడం చారిత్రాత్మకమని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మొదట కలెక్టర్‌గా చేసి అనంతరం ప్రజాప్రతినిధిగా మారిన వెంకట్రామిరెడ్డి ధరణి పేరుతో చేసిన మోసాలు బయటపెడతానని చెప్పారు. ఓ గెస్ట్ హౌస్‌లో ఉండి వివాదాస్పద ల్యాండ్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్నారని ఆరోపించారు. లావణ్య పట్టా వంటి పేరుతో బెదిరించి భూములు కొన్ని కంపెనీల పేరుతో లాక్కున్నారని చెప్పారు. గిరిజనుల నుంచి భూములు లాక్కున్నారని అన్నారు. పార్లమెంట్ సమావేశాల అనంతరం తన కార్యాచరణ ప్రారంభిస్తానని తెలిపారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు పెండింగ్ చెక్కులను క్లియర్ చేయించే ప్రయత్నం చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐటీఐఆర్‌లో ఏ పరిశ్రమ వస్తుందనేది ఎక్కడా చెప్పలేదని విమర్శించారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దినట్టు జగ్గారెడ్డి వ్యవహరిస్తున్నారని అన్నారు. జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా గుర్తించాలని అసెంబ్లీలో డిమాండ్ చేశానని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీలో సంజాయిషీ ఇచ్చుకునే పరిస్థితిని తన మొదటి ప్రశ్నకే తెచ్చానని అన్నారు. అసెంబ్లీలో ఉన్నప్పుడు ప్రశ్నించే గొంతుకగా నిలిచానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్వర్యంలో దేశాభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## కేసీఆర్‌ను సీఎం చేయడమే మా లక్ష్యం



**విశ్వంభర, వరంగల్:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో కోలుకోని ఎదురుదెబ్బ తగలడంతో ఇప్పటికీ ఆ పార్టీలోని నేతలు కోలుకోవడం లేదు. ఈ తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి ఆపరేషన్ ఆకర్శ్‌కు తెరలేపారు. శుక్రవారం బీఆర్ఎస్ కీలక నేత, తెలంగాణ మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయాన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలవగా కొద్ది సేపు ఇరువురూ భేటీ అయ్యారు. అనంతరం పోచారంకు పుష్ప గుచ్ఛం అందజేసి మెడలో హస్తం కండువా కప్పి సీఎం వారిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరిగింది.
ఈ వార్తలు వస్తున్న క్రమంలో తాజాగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియాతో మాట్లాడుతూ పార్టీ మారడంపై క్లారిటీ ఇచ్చారు. తాను బీఆర్ఎస్‌ను వీడటం లేదని స్పష్టం చేశారు. ఇతర పార్టీలో చేరే ఆలోచనే తనకు లేదని తేల్చిచెప్పారు. ప్రస్తుతం ఎన్నికల ఫలితాలపై సమీక్షించుకుంటున్నట్లు వెల్లడించారు. మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ రైతు ప్రభుత్వమని చెబుతూ మోసం చేయొద్దని సూచించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు మేలు జరిగిందన్నారు.

# ప్రధాన ప్రతిపక్ష నేత హోదా గల్లంతు?

(మొదటి పేజీ తరువాయి)

హోదా ఉండకూడదు. ఉండకూడదంటే బీఆర్ఎస్ బలం 12కన్నా తగ్గిపోవాలి.

**కాంగ్రెస్ టార్గెట్ 30 మంది ఎమ్మెల్యేలు**

కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా ఉండకూడదని అధికారపార్టీ నేతలు సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. ఎన్నికలు అయిన కొద్దిరోజులకే కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణించటంతో ఉపఎన్నిక జరిగింది. ఆ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలవటంతో బీఆర్ఎస్ బలం 38కి తగ్గిపోయింది. ఈమధ్య నలుగురు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, పోచారం శ్రీనివాసరెడ్డి కారుదిగేసి హస్తంపార్టీలో చేరిపోయారు. అంటే బీఆర్ఎస్ ప్రస్తుత బలం 34. ఇందులో నుండి మరో 20 మంది ఎంఎల్ఏలు తొందరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు విపరీతంగా ప్రచారంలో ఉంది. ప్రచారంలో ఉన్నట్లే 20 మంది ఎంఎల్ఏలు పార్టీలో నుండి వచ్చేసినా ఇంకా 14 మంది ఎంఎల్ఏలు అయితే ఉంటారు. కాబట్టి కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదాకి వచ్చిన ఇబ్బంది ఏమీ ఉండదు. మిగిలిన 14 మందిలో ఇద్దరికన్నా ఎక్కువమంది వచ్చేసినపుడే కేసీఆర్ కు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా పోతుంది. అందుకనే కేసీఆర్‌ను దెబ్బ కొట్టేందుకు వీలుంటే 30 మంది ఎమ్మెల్యేలను



లాక్కోవాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకున్నది. కాంగ్రెస్ ప్లన్ సక్సెస్ అయితే బీఆర్ఎస్‌కు రెండు నష్టాలు జరుగుతాయి.

**ఒక్క దెబ్బకు రెండు నష్టాలు**

అవేమిటంటే మొదటిది కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా పోతుంది. రెండో నష్టం ఏమిటంటే అసెంబ్లీలో తమదే నిజమైన బీఆర్ఎస్ అని మెజారిటీ ఎమ్మెల్యేలు క్లైం చేసుకునే అవకాశముంది. ఇదే జరిగితే కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షమనే గుర్తింపు కోల్పోతుంది. పార్టీ ఎమ్మెల్యేల్లో చీలిక వచ్చేసి మెజారిటీ తమదే అసలైన బీఆర్ఎస్ అంటే మాత్రం ప్రధాన ప్రతిపక్ష నేత హోదా గుర్తింపులో సమీకరణలు మొత్తం తారుమారైపోతుంది. అప్పుడు కేసీఆర్ నాయకత్వంలోని ఎమ్మెల్యేలు చీలికవర్గంపై అనర్హత వేటుకు లేఖలు ఇస్తూనే ఉంటారు.. వాటిని స్పీకర్ పక్కన పడేస్తూనే ఉంటారు. ఎవరిపైనా ఎలాంటి చర్యలూ స్పీకర్ తీసుకోరు. ఎందుకంటే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్షాలను చీల్చి చెండాడి చేసింది ఇదే కాబట్టి. టీడీపీ ఎమ్మెల్యేలను లాగేసుకుని చివరకు టీడీపీనే అసెంబ్లీలో లేకుండా చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో విలీనం చేసేసుకున్నారు. తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో చీలికలు తెచ్చి చాలామందిని తనపార్టీలోకి లాగేసుకున్నారు. అప్పట్లో పార్టీని వదిలేసిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేయాలని టీడీపీ, కాంగ్రెస్ ఎంత మొత్తుకున్నా అప్పటి స్పీకర్ పట్టించుకోలేదు. తాజాగా కేసీఆర్‌కు కూడా అదే జరుగుతుందనటంలో సందేహంలేదు. ఎమ్మెల్యేలు చీలి వచ్చేస్తే వచ్చేసిన వాళ్ళని స్పీకర్ చీలికవర్గంగా గుర్తిస్తారా ? లేకపోతే కాంగ్రెస్ సభ్యులుగా గుర్తిస్తారా అన్నది స్పీకర్ విచక్షణ మీద ఆధారపడుంది. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది పక్కనపెట్టేస్తే ముందు కేసీఆర్ సమస్యల్లో పడిపోవటం ఖాయం. కాకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇప్పుడొచ్చినట్లే ఒక్కొక్కరుగా వస్తారా ? లేకపోతే గ్రూపుగా వచ్చేస్తారా ? అన్నది చూడాలి. కేసీఆర్‌కు సమస్య అసెంబ్లీలోనే కాదు.. శాసనమండలిలో కూడా పొంచుంది. 29 మంది ఎమ్మెల్సీల్లో మెజారిటీ సభ్యులను లాగేసుకునేందుకు రేవంత్ ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అదే జరిగితే ఇటు అసెంబ్లీ అటు మండలిలో ఒకేసారి కేసీఆర్‌కు పెద్ద దెబ్బపడటం ఖాయమనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. మరి చివరకు ఏమవుతుందో చూడాల్సిందే.

# సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ

- కాంగ్రెస్‌ను నమ్మిన నిరుద్యోగులు రోడ్డున పడ్డారు
- గ్రూప్ 1, డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
- కేబినెట్ భేటీలో నిరుద్యోగుల గురించి చర్చించారా..?
- లేఖలో ప్రశ్నించిన మాజీ మంత్రి హరీష్ రావు



**విశ్వంభర, సిద్ధిపేట:** కాంగ్రెస్‌ను నమ్మి అధికారంలోకి తీసుకొచ్చిన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం రోడ్డున పడి అలమటించాల్సిన పరిస్థితి తెచ్చారని బీఆర్ఎస్ నేత, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్లపై సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. గ్రూప్ 1, డీఎస్సీ తదితర ఉద్యోగాల కోసం చేపట్టిన నియామక ప్రక్రియ కూడా ఉద్యోగార్థులకు చాలా ఇబ్బందికరంగా మారిందని హరీశ్‌రావు తెలిపారు. గ్రూప్ 1 ఉద్యోగాలకు 1: 100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. ప్రధానంగా గ్రూప్2, గ్రూప్ 3 పోస్టులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రెండు లక్షల ఉద్యోగాలను గుర్తించి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతిని కూడా వెంటనే చెల్లించాలన్నారు. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల ఆందోళన, ఆవేదనను కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని ఆశించామని, కేబినెట్ సమావేశంలో వారికి న్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకుంటుందని ఎదురుచూశామని తెలిపారు. కానీ అందరి ఆశలు అడియాశలు చేసేలా, నిరాశలోకి నెట్టేసేలా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యల గురించి ఎలాంటి చర్చ లేకుండానే కేబినెట్ సమావేశాన్ని ముగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

# చంద్రబాబుతో పోటీపడత..

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించేలా చేశారన్నారు. పేదలకు వైద్య సేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆలోచనలు అమలవుతున్న తీరు చూసి ఆయన మనల్ని స్వర్గం నుంచి ఆశీర్వదిస్తారని చెప్పారు. ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీ పడి పని చేసే అవకాశం తనకు గతంలో వచ్చిందని నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలన్నారు. తెలంగాణలో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని ఈ సందర్భంగా వెల్లడించారు. అన్ని రకాల వైద్య సేవలు అందేలా హెల్త్ టూరిజం హబ్ ఉంటుందని చెప్పారు.



ఇందులో బసవతారకం ఆసుపత్రికి చోటు ఖచ్చితంగా ఉంటుందని భరోసా కల్పించారు.వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనేలా తీర్చిదిద్దుతామన్నారు. రాజకీయం, సంక్షేమం ఈ రెండింటిని ఎన్టీఆర్ వారసత్వంగా ఇచ్చారని కీర్తించారు. ఎన్టీఆర్ మూడో తరం కూడా దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నందమూరి బాలకృష్ణ తనను 25వ వార్షికోత్సవంకు రావాలని కోరుతున్నారు.. 30వ వార్షికోత్సవానికి కూడా తానే వస్తానని సీఎం రేవంత్ చెప్పారు. ఆస్పత్రి లీజ్ వివాదాన్ని క్యాబినేట్ నిర్ణయం తీసుకుని పరిష్కరించామన్నారు.గతంలో తాను 12 గంటలు పని చేస్తే చాలు అనుకునే వాడిని.. కానీ పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి 18 గంటలు పని చేసే వ్యక్తిఅని చెప్పారు. ఒక ఆటగాడి నైపుణ్యం తెలియాలి అంటే మరొక మంచి ఆటగాడితో పోటీ పడాలన్నారు. ఇప్పుడు ఏపీలో సీఎంగా చంద్రబాబు ఉన్నారని.. దీంతో తనతో సహా రాష్ట్రంలోని అధికారులంతా అంతే ధీటుగా 18 గంటలు పని చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మూడోతరం అయిన లోకేష్ బాబు, భరత్ రాజకీయాల్లో, సంక్షేమంలో ఎలాంటి మార్క్ కనబరుస్తారో చూడాలని సీఎం రేవంత్ తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు.

# రాష్ట్రాన్ని తాకట్టుపెట్టేందుకు యత్నం

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకించిందని గుర్తుచేశారు. మీ ప్రభుత్వం లాగా మా ప్రభుత్వం నుంచి ఎవరూ వేలంలో పాల్గొనలేదని తెలిపారు. అన్ని రంగాలకు ద్రోహం చేస్తున్న పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకొని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్న పార్టీ తమదన్నారు. గనుల వేలంలో పాల్గొన్న మిమ్మల్ని, మీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని తెలంగాణ చరిత్ర క్షమించదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తమ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనుల అమ్మకాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకించిందన్నారు. అందుకే ప్రభుత్వం ఏ రోజూ వేలంలో పాల్గొనలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం నిస్సిగ్గుగా వేలంలో పాల్గొని తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ కొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందన్నారు. వేలంలో గనులను దక్కించుకున్న రెండు కంపెనీలు కేవలం బీఆర్ఎస్ పార్టీ సింగరేణి ప్రయోజనాల కోసం నిలబడడంతోనే మైనింగ్ ప్రారంభించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ గనులను కేటాయించినా, కేవలం రాష్ట్ర ప్రభుత్వ కఠిన వైఖరి, నిబద్ధత వల్లనే ఆ కంపెనీలు సింగరేణి బొగ్గును తవ్వలేకపోయాయని తెలిపారు. ఆ పూర్తి క్రెడిట్ బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. ఇప్పటికే నదీ జలాల వాటాను వదులుకున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారని చెప్పారు. తాజాగా బీజేపీకి అందిస్తున్న సహకారంతో సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేయాలన్న కుట్ర అందరికీ తెలిసిపోయిందని వెల్లడించారు.

## వచ్చే నెల నుంచే రైతు రుణమాఫీ..



**విశ్వంభర, ఖమ్మం:** తెలంగాణలో రైతు రుణమాఫీని ఆగస్టు 15లోపు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం నాడు కేబినెట్ కూడా దానికి ఆమోదం తెలిపింది. రైతు రుణమాఫీని ఆగస్టు 15లోపు కచ్చితంగా పూర్తి చేసి తీరుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఎప్పటి నుంచి అనే దానిపై తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జులై నుంచే రుణమాఫీని ప్రారంభిస్తామని వివరించారు. రైతుల రుణమాఫీని వంద శాతం పూర్తి చేస్తామని.. కొందరికి చేసి.. కొందరికి వదిలేయబోమని స్పష్టం చేశారు. తాము రైతు రుణమాఫీని చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక ఇష్టం వచ్చినట్టు ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు అవసరం అవుతాయని.. అందుకు తగ్గ నిధులను సేకరిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనలతో ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని తెలిపారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# పంటల సాగు చేసేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

జూరాల మినహా దాదాపు అన్ని ప్రధాన, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి ఇంకా మొదటి వరదనీటి ప్రవాహాలు రాలేదు. జూన్‌లో ప్రాజెక్టుల పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురవక నీటి కష్టాలు ఏర్పడ్డాయి.

**నాగార్జునసాగర్ జలాశయంలో అడుగంటిన నీరు**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా శనివారం నాటి నీటిమట్టం 504 అడుగులకు పడిపోయింది. గత సంవత్సరం ఈ ప్రాజెక్టు జలాశయంలో శనివారం నాటికి 149.270 టీఎంసీల నీరుంది. కాగా ఈ ఏడాది శనివారం నాడు నాగార్జునసాగర్ లో 122.350 టీఎంసీలకు పడిపోయింది. గత ఏడాది సరిగా వర్షాలు కురవక ప్రాజెక్టులోకి నీరు చేరలేదు. రుతుపవనాలు ప్రవేశించాక కూడా వర్షాలు సరిగా కురవక పోవడంతో ప్రాజెక్టు జలమట్టం అడుగంటింది.

**తాగునీటికి అందని నీరు**



ఈ ప్రాజెక్టు నుంచి జంటనగరాలు,మూడు జిల్లాల తాగునీటి అవసరాలకు నీరు అందించే పరిస్థితి లేదు. ప్రాజెక్టుకు వచ్చే మొత్తం ఇన్‌ఫ్లోలు చాలా తక్కువగా ఉండడంతో గతేడాది వర్షాకాలం,యాసంగి సీజన్‌లలో రెండు పంటలకు క్రాప్ హాలిడే ప్రకటించారు.ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండాలంటే 190 టీఎంసీల నీరు అవసరం.ఈ ప్రాజెక్టు నిండితే సాగర్ ఎడమ కాలువ ద్వారా 6.16 లక్షల ఎకరాల ఆయకట్టు తెలంగాణలో సాగులోకి వస్తుంది.

**జూరాల జలాశయానికి వచ్చిన నీరు**

గతేడాది వరకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహణలో ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చేతుల్లోకి వెళ్లింది.శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 813 అడుగులకు పడిపోయింది. శ్రీశైలం ప్రాజెక్టులో కేవలం 36 టీఎంసీల నీరు మాత్రమే మిగిలింది.జూరాల ప్రాజెక్టుకు గత మూడు వారాలుగా 6.56 టీఎంసీల నీరు రావడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

**గోదావరి బేసిన్ ప్రాజెక్టులు ఖాళీ**

గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు తాత్కాలిక మరమ్మతుల నిమిత్తం మేడిగడ్డ,అన్నారం,సుందిళ్ల వద్ద కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు బ్యారేజీలను ఖాళీ చేశారు. దీంతో శ్రీపాద ఎల్లంపల్లికి గత నాలుగు నెలలుగా నీరు రాలేదు.ఎల్లంపల్లి నీటి సామర్థ్యం 20.18 టీఎంసీలకు గాను 4.21 టీఎంసీల నీరు మాత్రమే మిగిలింది.శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు జలాశయంలో నీటినిల్వ సామర్థ్యం 90 టీఎంసీలకు గాను 8 టీఎంసీల నీరు మిగిలింది.

**హైదరాబాద్ కు ఎల్లంపల్లి నీరు అత్యవసర పంపింగ్**

గోదావరి ఒడ్డున ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాశయంలో కేవలం 4.21 టీఎంసీల లైవ్ స్టోరేజీతో మిగిలి ఉంది. ఇందులో రోజుకు 168 మిలియన్ గ్యాలన్ల నీటిని హైదరాబాద్ నగరానికి సరఫరా చేస్తున్నారు.ఎనిమిదేళ్ల విరామం తర్వాత హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి అత్యవసర పంపింగ్‌ను శుక్రవారం ప్రారంభించింది. ఎల్లంపల్లి నీటిని నగరంలో సరఫరా చేస్తున్నామని వాటర్ బోర్డు ఎండీ సుదర్శనరెడ్డి చెప్పారు. హైదరాబాద్ మహానగరంలోని మంచినీటి జలాశయాలు, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీటి సరఫరా అధికారులకు సవాలుగా మారింది. ఒక్క ఏప్రిల్‌లోనే 2.37 లక్షల ట్రిప్పుల నీటి ట్యాంకర్ల ద్వారా నీరందించారు. ఈ రిజర్వాయర్ వద్ద పంపింగ్ చేసిన నీటిని ఐటీ కారిడార్‌లోని మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, లింగంపల్లి, మియాపూర్,చందానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, కుత్బుల్లాపూర్, అల్వాల్, మల్కాజ్‌గిరి తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.

## ఆకాశం వైపు ఎదురుచూస్తున్న రైతులు

**జూన్ నెల రుతుపవనాల ప్రభావంతో వర్షా లు కురవక పత్తి విత్తనాలు వేసిన రైతులు ఆశగా వర్షా ల కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. వర్షా ల్లేక నారుమళ్లు ఎండిపోతున్నాయి. మరో వైపు వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తక రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి స్టోరేజీ తక్కువగా ఉంది. చిన్న నీటి వనరులైన చెరువుల్లోనూ వరదనీరు రాలేదు. రుతుపవనాల ప్రభావం వల్ల భారీవర్షా లు కురిసి ప్రాజెక్టుల్లోకి నీరు వస్తేనే ఖరీఫ్ ఆయకట్టు సాగులోకి వస్తుంది.**

# 'లక్ష్మీపుత్రుడు కాదు.. లంక పుత్రుడు'

## పోచారంపై మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్:** అసెంబ్లీ మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మార్పు వ్యవహారం తెలంగాణ పాలిటిక్స్‌లో కాక రేపుతోంది. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు వీర విధేయుడిలా ఉన్న పోచారం అనుహ్యంగా గులాబీ బాస్‌కు షాక్ ఇచ్చారు. ఎవరూ ఊహించని విధంగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పోచారం అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయ్యారు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి పోచారం ఇంటికి వచ్చి పార్టీలో చేరాలని ఆహ్వానించారు. దీంతో పోచారం ఆయన కొడుకు భాస్కర్ రెడ్డితో కలిసి అధికార పార్టీలో జాయిన్ అయ్యారు. దీంతో పోచారంపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమంటున్నారు. పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లు వివిధ పదవులు అనుభవించి.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నుపోటు పొడిచారని ఫైర్ అవుతున్నారు. ఈ క్రమంలోనే పోచారం పార్టీ మార్పుపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు పోచారం శ్రీనివాస్ రెడ్డి ద్రోహం చేశారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్‌లో పోచారం పదవులు అనుభవించారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సందర్భంగా పోచారం కుటుంబ సభ్యులపై సీఎం రేవంత్ రెడ్డి నీచంగా మాట్లాడారని, ఇప్పుడు సిగ్గు లేకుండా మళ్లీ ఆయన పార్టీలో చేర్చుకున్నారని ఘాటు విమర్శలు చేశారు. దమ్ముంటే పోచారం ఎమ్మెల్యే పదవికి రాజీనామా మళ్లీ పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి గతంలో చంద్రబాబు, కేసీఆర్‌కు ద్రోహం చేశారు.. రేపు రేవంత్ రెడ్డిని కూడా మోసం చేస్తారని అన్నారు. కేసీఆర్ అన్నట్లు పోచారం లక్ష్మీపుత్రుడు కాదని, లంక పుత్రుడని ఎద్దేవా చేశారు.




# రెండు లక్షల రుణమాఫీ గతంలో ఎవరు చేయలే

## తెలంగాణ రైతులకు శుభాకాంక్షలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**విశ్వంభర, నల్గొండ:** నల్లగొండ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజర్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ నిర్ణయం తీసుకున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ గతంలో ఎవరు చేయలేదని, గత ప్రభుత్వాలు చేసిన రుణమాఫీ వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ దేశంలో ఏ ప్రభుత్వం కూడా అమలు చేయలేదని ఆయన వ్యాఖ్యానించారు. రైతులకు సంబంధించిన ఏ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం రాజీపడదని, రైతు భరోసా ఏ విధంగా చేయానే దానిపై ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. రెండు లక్షల రుణమాఫీ అందుకుంటున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు మంత్రి కోమటిరెడ్డి. అంతేకాకుండా.. జిల్లాలో ఏ గ్రామంలో కూడా మిషన్ భగీరథ పథకం అందడం లేదని, ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులతో సమీక్ష నిర్వహించి పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా

# ఆషాఢ బోనాలు నిర్వహించాలి

### మంత్రి కొండా సురేఖ



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆషాఢ బోనాల ఉత్సవాలు సాగాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ యేడాది బోనాల నిర్వహణకు సీఎం రేవంత్ రెడ్డి రూ. 20 కోట్లను మంజూరు చేశారని మంత్రి సురేఖ ప్రకటించారు. బోనాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని దేవాదాయ శాఖ కమిషనర్లతో మంత్రి సురేఖ శనివారం సెక్రటేరియట్ లోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. బోనాల ఉత్సవ ఏర్పాట్లు, బడ్జెట్ కేటాయింపు తదితర అంశాల పై మంత్రి సురేఖ ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్లు కృష్ణవేణి, బాలాజీ, సంధ్యా రాణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరిలోని ప్రధాన దేవాలయాలతోపాటు ఇతర దేవాలయాల్లో బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేవాలయాల అలంకరణ, పట్టు వస్త్రాలు కొనుగోలు, బోనాల సమాచారాన్ని తెలిపే పుస్తకాల ముద్రణ, అంబారీ నిమిత్తం ఏనుగు సేవల వినియోగం, విద్యుత్, సాంస్కృతిక, సమాచార ప్రజాసంబంధాల శాఖ ప్రచారం తదితర ఖర్చుల కోసం ఈ మొత్తాన్ని వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ యేడాది బోనాల నిర్వహణ నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చైర్మన్‌గా రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి సురేఖ పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రి అయిన తాను, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యులుగా, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి సభ్యులు, కన్వీనర్‌గా మొత్తంగా ఏడుగురితో కూడిన కమిటి బోనాల ఉత్సవ నిర్వహణా బాధ్యతలను చేపడుతుందని తెలిపారు. ఇతర ప్రధాన దేవాలయాలకు ఉత్సవ కమిటీల ఎంపిక ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తవుతుందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టను చాటేలా బోనాలను నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు. జోగినీల బోనాల సమర్పణ సమయంలో ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, వారికి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తవహించాలని అన్నారు. బోనాల ఉత్సవాలను ప్రదర్శించేలా హోర్డింగ్ లు, ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, బోనాల ఉత్సవాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రసారమాధ్యమమైన డిడి యాదగిరి ఛానల్ లో లైవ్ ప్రసారాలు సాగేటట్లు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏనుగు తరలింపు పై ఆరా తీశారు. ఢిల్లీ కేంద్రంగా తెలంగాణ భవన్ లో తెలంగాణ ఖ్యాతి ఇనుమడించేలా ఉత్సవాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పనుల నిమిత్తం అవసరమయ్యే నిధుల కేటాయింపు పై మంత్రి అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలే కేంద్రంగా ఈ యేడాది బోనాలను నిర్వహిస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# ఎకో టూరిజంపై కమిటీ

- టూరిజం అభివృద్ధి కోసం కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం
- కమిటీ చైర్మన్‌గా మంత్రి కొండా సురేఖ



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధి కోసం కాంగ్రెస్ సర్కార్ కమిటీ వేసింది. ఈ కమిటీ చైర్మన్‌గా మంత్రి కొండా సురేఖ.. మరో 16 మంది అధికారులను సభ్యులుగా నియమిస్తూ సర్కార్ జీవో విడుదల చేసింది. ఎకో టూరిజం అభివృద్ధి కోసం కమిటీ మూడు సమావేశాల్లో ఆయా టూరిజం స్పాట్స్‌ను గుర్తించాలని సూచించింది. ప్రత్యేకమైన ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కమిటీకి ఆదేశాలు జారి చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎకో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ. పర్యావరణానికి, వన్య ప్రాణులకు ఏ మాత్రం హాని కలగకుండా.. ఎకో టూరిజం పాలసీని అభివృద్ధి చేస్తామన్నారు. శనివారం సచివాలయంలోని అటవీ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎకో టూరిజం కన్సల్టేటివ్ కమిటి చైర్మన్, మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎకో టూరిజం అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సరికొత్తగా ఆవిష్కరించనున్నామన్నారు. రాష్ట్రంలోని 12 సర్క్యూట్‌లలో 40 ఎకో టూరిజం స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. అడ్వెంచర్, రీక్రియేషన్, ఆధ్యాత్మిక, వారసత్వ, సినీ, వెడ్డింగ్, నేచర్ అండ్ వైల్డ్ లైఫ్, హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎకో టూరిజం పాలసీ రూపకల్పనలో అటవీ, దేవాదాయ, రెవెన్యూ, పర్యాటక శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఆర్కియాలజీ శాఖతో సంప్రదింపులు జరిపి రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం ఎకో టూరిజం పాలసీ రూపకల్పన పేరుతో కాలయాపన చేసిందని మంత్రి విమర్శించారు. ఒడిషా, కర్నాటక రాష్ట్రాల్లో అమలవుతున్న ఎకో టూరిజం విధానాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఆ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు గమనించిన పరిస్థితులను ఇక్కడి పరిస్థితులతో బేరీజు వేసుకొని అత్యుత్తమ ఎకో టూరిజం పాలసీల రూపకల్పనకు కృషి చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. గతంలో జరిగిన సమావేశంలో ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతాలు, వన్యప్రాణుల, వలస పక్షుల ఆవాసాలు, జీవవైవిధ్య ప్రాంతాలు, వారసత్వ కట్టడాలున్న ప్రాంతాల్లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రేవంత్ రెడ్డి సూచించిన విషయాన్ని మంత్రి సురేఖ అధికారులకు గుర్తు చేశారు.




# ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

**విశ్వంభర, అమరావతి:** రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.


- గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి
- ప్రస్తుతం గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాల్‌రెడ్డి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశం
- విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున జీఏడీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు
- విశాఖ జేసీకి కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు
- ఏలూరు జిల్లా కలెక్టర్‌గా కె.వెట్రిసెల్వి నియామకం
- అల్లూరి జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత బదిలీ
- అల్లూరి కలెక్టర్‌గా దినేష్‌కుమార్ నియామకం
- తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పి.ప్రశాంతి
- విజయనగరం జిల్లా కలెక్టర్‌గా బి.ఆర్.అంబేద్కర్
- పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి
- చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా సుమిత్‌కుమార్
- కాకినాడ జిల్లా కలెక్టర్‌గా సగలి షణ్మోహన్
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా జి.సృజన
- ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా
- కర్నూలు జిల్లా కలెక్టర్‌గా రంజిత్ బాషా
- బాపట్ల కలెక్టర్‌గా ఆ జిల్లా జేసీకి పూర్తి అదనపు బాధ్యతలు

# మాదాపూర్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో పోలీసులు భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. శనివారం పోలీసులు మాదాపూర్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో డ్రగ్స్‌ను గుర్తించారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకువస్తున్న సాయి చరణ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్‌ను చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్స్ ద్వారా నిందితుడు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న నలుగురితో పాటు ప్రధాన నిందితుడు సాయిచరణ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు 50 మంది వ్యాపారవేత్తలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్, నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, విశాఖలో ఉన్న వ్యాపారవేత్తలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. రాజేశ్వరి ట్రావెల్స్, జీవీఆర్, స్టార్ట్, చెర్రీ ట్రావెల్స్ ద్వారా డ్రగ్స్ రవాణా చేస్తున్నాడని పోలీసులు వెల్లడించారు. మాదాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# ఉపాధ్యాయ లోకానికి ఆదర్శం గిజూబాయ్



**విద్యారంగంలో అత్యంత ప్రధానమైన మూడు ప్రశ్నలు వున్నాయి. అవి ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఎలా నేర్పించాలి? ఈ మూడు ప్రశ్నల పరిష్కారం పైనే విద్య ప్రయోజకత్వం ఆధారపడి వుంది. విద్యకు సంబంధించిన ఏ ప్రణాళికలోనైనా, ఏ పద్ధతిలోనైనా ఈ మూడు అంశాలు తప్పకుండా గమనింపబడాలి. ఈ మూడింటిని చర్చగా సమన్వయ పరచినపుడే ఫలితాలు మంచివిగా మనకందగలవు. ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఈ రెండూ వ్యక్తి అవసరాలు, సమాజ అవసరాలు, దేశ అవసరాలపై ఆధారపడి ఉంటాయి. ఈ అవసరాలు కూడా తాత్కాలికమైనవిగాను, శాశ్వతమైనవిగాను రెండు రకాలుగా ఉంటాయి. అందువల్ల మనం నేర్పించదలచుకున్న దాని పద్ధతి మారుతూ ఉంటుంది. ఈ కారణం చేతే విద్యా ప్రణాళిక కూడా ఎల్లప్పడూ మారుతూనే ఉంటుంది. అలాగే విద్య నియమనిబంధనలు కూడా, పద్ధతులు కూడా, ఫలితాలు కూడా నిర్ధారించటానికి విద్యావేత్తలు, మేధావులు నిరంతరం ప్రయత్నిస్తూ.. ఉంటారు.ఇలాంటి భావాలకు మొదట రూపకల్పన చేసినవారు "గిజూబాయి గారు"**

నవంబర్ 15,1885 న జన్మించి తన జీవితాన్ని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా తన అనుభవాలను ఉపయోగించి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఎన్నో అమూల్య సూచనలు, సలహాలతో భారతీయ విద్యావిధానంలో ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఎలా ఉండాలనే విషయాల్ని తెలుపుతూ ప్రత్యేకంగా వసతిని ఏర్పాటు చేసి వాటిని అమలు చేసి ఆదర్శంగా నిలిచిన మహానుభావుడు గిజుబాయి. ఎన్నో సముచిత మార్గాలను ఉపాధ్యాయులకు సూచించి జూన్ 23,1939 న తనువు చాలించిన మహాజ్ఞాని గిజుబాయ్.

సులభమైన భాషలో యధార్థ విద్యాపరిస్థితులను విశ్లేషించడంలో గిజూభాయి సాటి ఎవరూ లేరు. ఆయన ఉపాధ్యాయుల పరిమితులను, ఇబ్బందులను కూడా బాగా అర్థం చేసుకున్న వారు. ఉపాధ్యాయులను బంధించి ఉంచిన ఈ వ్యవస్థ కూరత్వం కూడా ఆయనకు బాగా తెలుసు."స్కూలు అనే ఎడారిలో పిల్లలు పడే బాధలు" ఆయన చూడలేక పోయారు. వారి బాధల నివారణకే ఆయన విద్యారంగంలో కొత్త కొత్త ప్రయోగాలు ఆవిష్కరించారు.

పిల్లల వికాసాన్ని దగ్గరగా వుండి చూడడానికి, సూక్ష్మంగా ఆలోచించడానికి తాను అనుకున్న విద్యా విలువలు నిరూపించటానికి ఆయన భావనగర్లో ఒక ప్రయోగశాల రూపంలో 'దక్షిణామూర్తి బాల మందిరం' స్థాపించారు. పిల్లల అవసరాలు, పిల్లల అభిరుచులు, పిల్లల శక్తిసామర్థ్యాలు మున్నగువాటిని గమనంలో పుంచుకుని ఆయన అక్కడ అనేక ప్రయోగాలు చేశారు. తదనంతరం వాటినన్నింటి సారాన్ని 'నూతన శిక్షణ' రూపంలో గిజూభాయి మనకు అందించారు. క్రొత్త దృక్పథం, క్రొత్త చైతన్యం, క్రొత్త జాగృతికి చిహ్నమైన గిజుభయ్ జీవితం అందరికీ ఆదర్శం.

పుట్టినప్పటి నుంచి పిల్లలు తమ తల్లిదండ్రుల నుంచి, తమ కుటుంబం నుంచి వారు పడే కష్టాలు, పొందే వేదనలు, బాధలు, దుఃఖాలు ఇన్నీ అన్నీ కావు. పిల్లలు ఎలాంటి నేరగాళ్ళు కారు వారు అత్యంత అమాయకులు అయినప్పటికీ మనం మన అజ్ఞానం చేత, తెలివిలేని తనం చేత, మనకు సాధారణంగా వున్న బలహీనతల చేత, మన పిల్లలనే రాత్రింబవళ్ళు వేదిస్తూవుంటాము. మాటి మాటికీ అవమానిస్తూ, కొడుతూ, తిడుతూ వారి జీవితాన్ని నరకప్రాయం చేస్తూవుంటాము. ఒక్కసారి ఆలోచిద్దాం.. మన పిల్లలను మనము చీటికీ మాటికీ తిడుతున్నామా లేదా? కొడుతున్నామా లేదా? చెప్పిన మాట వినలేదని దండిస్తున్నామా లేదా? మరీ మనకు కోపం హెచ్చితే ఇంటి నుంచి వారిని తరిమిగొడుతున్నామా లేదా? వీటికి ఏమైనా హద్దూ పద్దూ ఉందా? సాధారణంగా మన ఇళ్ళల్లో పెద్దవాళ్ళమైన మన చేతులే పైన ఉంటాయి. కానీ పాపం పిల్లలు బిక్కు బిక్కుమని అమాయక చూపులతో ఇంటిలోని ఒక మూలలో ఒదిగి పడిఉంటారు. ఇలాంటి కుటుంబాలు కోకొల్లలు. ఇది నాటి కాలపు పరిస్థితి కానీ నేడు మార్పు జరిగింది. అప్పటి ఆలోచన విధానంపై ఆనాటి రచనలు కొనసాగాయి.

అలాంటి అసంఖ్యాకమైన పిల్లలను రక్షించడానికి అన్నట్లు ఆవిర్భవించిన గుజరాతీ మహోపాధ్యాయుడు "గిజూభాయి బధేకా".గుజరాత్‌లో పిల్లల మనోహరమైన శిక్షణా సంస్థ స్థాపించి! మాంటిసోరీ పద్ధతిలో నవీన బోధనకు శ్రీకారం చుట్టిన మహానుభావుడు గిజుబాయ్. తల్లిదండ్రులకు, నూతన ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా సుమారు 17 ఉత్తమ పుస్తకాలను రచించారు. వీటిలో బాల మనస్తత్వ శాస్త్రం, వారి పెంపకం, వారి శిక్షణ, ప్రేమపూర్వకంగా వాత్సల్యంతో నిండి ఎలా చేయాలో మనకు ప్రబోధించారు. ఈ పుస్తకాలన్నింటినీ తెలుగు ప్రజలకు, ఉపాధ్యాయులకు అందడం కొరకు తర్జుమా చేసి 7 సంపుటాలుగా రూపొందించి 2010 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పాఠశాలకు ఉపాధ్యాయుల కొరకు పంపిణీ చేశారు. రాజల్ దేసర్ (రాజస్థాన్) లోని మాంటిసోరి బాల శిక్షణా సమితి హిందీలో ప్రచురించిన 17 భాగాల సంకలనంను పాఠకుల సౌలభ్యం కోసం వాటిని 7 సంపుటాలుగా ప్రచురించడం జరిగింది.

గిజూభాయి రచించిన పుస్తకాలలో తల్లితండ్రులకు, తల్లితండ్రుల ప్రశ్నలు, తల్లితండ్రులు కావడం కఠినం, తల్లితండ్రుల తల నొప్పి, ప్రాథమిక పాఠశాలలో భాషా శిక్షణ, ఉపాధ్యాయులు అయినప్పుడు శిక్షణ..నా భావనలు, ప్రాథమిక పాఠశాలల్లో బోధనా పద్ధతులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో లేఖా వాడనం, మాంటిసోరి పద్ధతి భాగం1 ,మాంటిసోరి పద్ధతి భాగం2,ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ భాగం1 ,ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ భాగం 2, కథా బోధనా పద్ధతి, అడుతూ.. పాడుతూ అనేవి ముఖ్యమైనవి.

పుస్తకాలలో 'మాంటిసోరి పద్ధతి', 'పగటికల', 'కథా బోధనా పద్ధతి' అత్యంత విలక్షణమైనవి. విద్యారంగంలో ఈ మూడు పుస్తకాలు చాలా మౌలికమైనవని భావింపబడుతాయి. ఇవి గిజూభాయి విద్యారంగానికి ఇచ్చిన కానుకలుగా గుర్తించబడినది. వీటిలో గిజూభాయి తన మేధస్సును, మనస్సును పూర్తిగా మేళవింపుచేసి రాయడం వల్ల వీటిని చదివిన వారు బాలల శిక్షణను పూర్తిగా అర్థం చేసుకొని వాటిలోని అర్థాన్ని గ్రహించగలిగే ఎన్నోఅంశాలు నిండివున్నాయి. ఇవి బాలల జీవితాలను లోతుగా అధ్యయనం చేయడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి.

ఈ పుస్తకాలు దేశములోని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తమ బాలలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని, శిక్షణా పద్ధతులను సమగ్రంగా అందిస్తాయని, కనుక వీటిని చదివి, ఆచరణలో పెట్టడం వల్ల తమ పిల్లలను మంచి పద్ధతిలో పెంచుతారని గిజూభాయి ఆశించారు.

మన దేశంలో "గిజూభాయి బధేకా" బాలల శిక్షణ కొరకు ఒక ఆందోళన ప్రారంభించారు. విద్య అంటే ఆయన దృష్టిలో ఎంతో విస్తృతమైన అర్థం కలిగి, దాని నిర్మాణం, రచన, వ్యవస్థ, సాధన, సంస్కారం మొదలగు ఎన్నో అర్థాలనిచ్చి వ్యక్తి వికాసం పెంపొందించుకుని, అలాగే ఒక వ్యక్తిత్వాన్ని రూపుదిద్దటానికి కూడా అతనిని ఎంతో సంస్కారవంతుడిగా మార్చాల్సి రావడం, అతడి వ్యక్తిత్వం అందంగా, తేజోవంతంగా, మారడమే విద్య అని భావించిన మేధావి గిజూభాయి బధేకా.

ఇటీవలి కాలంలోనే విద్యావేత్తలు విద్యా పద్ధతుల్లో శాస్త్రీయత వుండాలనే దిశగా ఈ ఆలోచించసాగారు. వారు అప్పటి వరకు వున్న అభివృద్ధి చెందిన విద్యా పద్ధతులన్నింటినీ సమీక్షించారు. వీటితో పాటే ఎన్నో కొత్త విద్యా పద్ధతులని ఆవిష్కరించారు. వాటిని అమలులో పెట్టి ఎన్నో విజయాలు కూడా సాధించారు. ప్రస్తుతం విద్యా రంగంలో విభిన్న బోధనా పద్ధతులు, వాటిలోని మంచి చెడులు, వీటన్నింటి గురించి ఆలోచించడానికే ఈ పుస్తకాలు ఉపయోగపడుచున్నవి.

సామాన్యంగా మనస్తత్వ శాస్త్ర సిద్ధాంతాల ఆధారంగానే బోధనా పద్ధతి నిర్ణయింపబడుతూవుంటుంది. అయితే మొత్తంగానే మనస్తత్వ శాస్త్రాన్ని అనుసరించే బోధనా పద్ధతి వుండదు. ఇందులో ఆ శాస్త్రంతో పాటు వ్యక్తిగత భావాలు కూడా సమానంగానే నిండి వుంటాయి. కనుక మనస్తత్వ శాస్త్రం, వ్యక్తిగత వికాసం ఈ రెండింటి సమన్వయంలోనే బోధనా పద్ధతి పునాది పడుతుంది.

ఇళ్ళల్లో తల్లి తన పిల్లవాడితో ఎక్కువ సమయం గడుపుతుంది. అందువల్ల ఆమె వాడికి అత్యంత సన్నిహితురాలు. తన బిడ్డను అర్థం చేసుకోవడానికి ఓర్పు, నేర్పు, శక్తి సామర్థ్యాలు తల్లిలోనే ఎక్కువగా వుంటాయి. స్వర్గీయ గిజూభాయి గారు కూడా తల్లి లాంటి సూక్ష్మ దృష్టితో, మమత నిండిన కళ్ళతో పిల్లలను చూచారు. వారి వ్యక్తిత్వాన్ని జాగ్రత్తగా వికసింపజేసే ప్రయత్నం చేశారు.

గిజూభాయి రచనలన్నీ అన్ని దేశ భాషలలోనూ రావలసి వుంది. ఆ రచనలు మన దేశ బాలల శిక్షణకు దిశానిర్దేశం చేసేవి. విద్యకు సంబంధించిన సిద్ధాంతాలను, బోధనా పద్ధతులను అర్థం చేసుకోవాలంటే ఆ రచనలు చదవడం అత్యవసరం. ఇంత కాలం తర్వాత కూడా ఆ పుస్తకాలు ఇందువల్లే ఉపయోగకరంగానూ, సందర్భోచితంగాను వున్నాయి. ఎందుకంటే అవన్నీ ఒక అనుభవం నిండిన ఉపాధ్యాయుడి అనుభవాల నుంచి వెలువడ్డాయి. ఆ కాలం నాటి జాతీయ నేపథ్యంలో, మానవత్వ నేపథ్యంలో ఆ రచనలు చేయబడ్డాయి.


కావునా వారి జీవితాన్ని, వారి రచనలు చదివి విద్యార్థితో ఎలా మసలుకోవాలో తెలుసుకొని చిన్నారులను ప్రేమతో చూసుకొని వారిని ఉత్తములుగా తయారు చేస్తారని ఆశిద్దాం.



-గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282
raghupatiraog@gmail.com

# కార్మిక పక్షపాతి వరహగిరి వెంకట గిరి

## నేడు మాజీ రాష్ట్రపతి వీవీ గిరి వర్ధంతి






భారత దేశానికి 4వ రాష్ట్రపతిగా, కార్మిక ఉద్యమానికి విశేషమైన సేవలు చేసిన వీవీ గిరిగా ప్రసిద్ధుడైన వరాహగిరి వేంకటగిరి (ఆగష్టు 10, 1894 జూన్ 23, 1980) గారు అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని గంజాం జిల్లాకు చెందిన బెర్హంపూర్ పట్టణములోని ఒక తెలుగు నియోగి బ్రాహ్మణ కుటుంబములో జన్మించారు. ఆయన తండ్రి వరాహగిరి వెంకటజోగయ్య ప్రసిద్ధిచెందిన న్యాయవాది. 1913లో ఆయన యూనివర్శిటీ కళాశాల డబ్లిన్‌లో న్యాయశాస్త్రం అభ్యసించడానికి వెళ్లారు. అయితే ఐర్లండ్‌లో సీన్‌ఫెన్ ఉద్యమంలో పాల్గొని దేశ బహిష్కరణకు గురయ్యారు. ఆ ఉద్యమ కాలంలోనే ఆయనకు ఈమొన్ డి వలేరా, మైఖెల్ కోలిన్స్, పాట్రిక్ పియర్సె, డెస్మండ్ ఫిట్జెరాల్డ్, ఈయోన్ మెక్‌నీల్, జేమ్స్ కాన్నలీ తదితరులతో సన్నిహితం ఏర్పడింది. 1914 లో బ్రిటన్‌లో గాంధీజిని కలిశారు. వారి సలహామేరకు బ్రిటన్ రెడ్ క్రాస్‌లో చేరారు. అక్కడే భారతీయవిద్యార్థి సంఘాన్ని స్థాపించి కార్యదర్శిగా పనిచేశారు. 1916 భారత దేశం వచ్చి న్యాయవాద వృత్తి చేపట్టారు. భారతీయ కార్మికుల సమస్యలపై పూర్తి అవగాహన ఏర్పరుచుకున్నారు. అనిబీసెంట్ ప్రారంభించిన హోంరూల్ ఉద్యమంలో భాగస్వామి అయ్యారు. జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. సహాయ నిరాకణ ఉద్యమంలో పాల్గొని ఏడాది చెరసాలశిక్ష అనుభవించారు. తర్వాత క్రియాశీలంగా కార్మిక ఉద్యమంలో పాల్గొని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్యకు ప్రధాన కార్యదర్శి, ఆ తరువాత అధ్యక్షులుగా పని చేశారు. రెండు పర్యాయాలు అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కూడా పనిచేశారు.

గిరి 1934లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో సభ్యుడయ్యాడు. 1936లో మద్రాసు రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గిరి కాంగ్రేస్ అభ్యర్థిగా బొబ్బిలి రాజాపై పోటీ చేసి గెలిచాడు. 1937లో మద్రాసు ప్రోవిన్స్‌లో రాజాజీ నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మిక, పరిశ్రమల మంత్రిగా పనిచేశాడు. 1942లో కాంగ్రేసు ప్రభుత్వాలన్నీ రాజీనామా చేసినప్పుడు, గిరి తిరిగి క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా కార్మిక ఉద్యమాన్ని నడిపి జైలుకు వెళ్ళాడు. ఈయనను రాజమండ్రి జైలులో ఖైదీగా ఉంచారు. 193437 వరకు భారత శాసన సభ్యుడిగా ఎంపిక అయ్యారు. 1927లో జనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశానికి హాజరయ్యారు. అనంతరం బొబ్బిలి రాజావారిపై పోటీ చేసి గెలుపొందారు. 1937 రాజాజి మంత్రివర్గంలో చేరారు.

1942లో కాంగ్రెస్ ప్రభుత్వాలన్నీ రాజీనామా చేసినప్పుడు, గిరి తిరిగి క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా కార్మిక ఉద్యమాన్ని నడిపి జైలుకు వెళ్ళారు. ఆయన రాజమండ్రి జైలులో ఖైదీగా ఉంచారు. 1946లో తిరిగి ప్రకాశం పంతులు ప్రభుత్వంలో కార్మిక మంత్రిగా పనిచేశారు. అనంతరం శ్రీలంకలో భారత్ హైకమిషనర్‌గా ఉన్నారు. 195760లో ఉత్తర ప్రదేశ్, 1960 65 కేరళ, 196567 మైసూర్ రాష్ట్రాలకు గౌర్నర్‌గా పనిచేశారు. 1967 భారత ఉపరాష్ట్రపతిగా ఎంపికయ్యారు. నాటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ 1969 మే 3న మరణించడంతో 1969 ఆగస్టు 24న భారత నాల్గవ రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు. పలు విశ్వవిద్యాలయాల గౌరవ డాక్టరేట్ అందుకున్న గిరిని 'భారతరత్న' వరించింది.

1969లో రాష్ట్రపతి ఎన్నికలో పార్టీ అధికారిక అభ్యర్థిగా పోటీ చేసిన నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా ఆత్మ ప్రబోధానుసారం ఓటు వెయ్యమని ఇందిరా గాంధీ తన పార్టీ వారిని ఆదేశించింది. ఫలితంగా ప్రతిపక్ష మద్దతు కూడా గల వీవీ గిరి, సంజీవరెడ్డిని ఓడించి రాష్ట్రపతి అయ్యారు. 248 1974 న వీవీ గిరి రాష్ట్రపతిగా పదవి విరమణ సందర్భంగా ఒక ప్రత్యేక తపాల బిళ్ళను విడుదల చేశారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494




# చంద్రబాబుతో రేవంత్ పోటీయా?

చంద్రబాబునాయుడుతో రేవంత్ రెడ్డి పోటీపడబోతున్నారు. ఎందులో అంటే అభివృద్ధిలో.. అవును మీరు సరిగ్గానే చదివారు. అభివృద్ధిలో తెలంగాణతో ఏపీ పోటీపడాలా ? లేకపోతే ఏపీతో తెలంగాణ పోటీపడాలా ? తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు నాలుగు వందల ఏళ్ళ చరిత్రుంది. ఇప్పటి హైదరాబాద్‌కు అభివృద్ధిలో భీజం పడింది 1995లో.. అంటే అంతకుముందు హైదరాబాద్‌లో అభివృద్ధి లేదనికాదు.1995లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత అభివృద్ధి ఒక్కసారిగా స్పీడందుకుంది. ఐటీ పరిశ్రమలు రావటం, నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణంతో డెవలప్మెంట్ జోరందుకుంది. తర్వాత వైఎస్సార్ సీఎం అవటంతో శంషాబాద్ అంర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో ప్రాజెక్టు పనులు, హైదరాబాద్ విస్తరణ తదితరాలతో అభివృద్ధి దూసుకుపోయింది. ఇది అందరికీ తెలిసిన సత్యం. ప్రత్యేక తెలంగాణ ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేనాటికి హైదరాబాద్ అన్నీ విధాలుగా డెవలప్ అయిన సిటీగా పాపులరైంది. ముందు ముఖ్యమంత్రుల అభివృద్ధిని కేసీఆర్ కూడా కంటిన్యుచేయటంతో మెట్రో ప్రాజెక్టు కల సాకారం కావటం తదితరాలతో అన్ని విధాలుగా అభివృద్ధిలో దూసుకుపోయింది.

**నాడు చంద్రబాబులో ఆ ఆలోచన లేదా..?**

ఇక ఏపీ విషయానికి వస్తే విభజన తర్వాత వైజాగ్ ఒక్కటే అన్ని విధాలుగా డెవలప్ అయిన కాస్మోపాలిటన్ నగరం. 2014లో ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు వైజాగ్‌నే రాజధానిగా చేసుకునుంటే ఈపాటికి బ్రహ్మాండమైన నగరంగా రూపుదిద్దుకునుండేది. అలా కాకుండా ఏదేదో భ్రమల్లో పడిపోయి ప్రపంచస్థాయి రాజధానిని నిర్మించాలనే భ్రమలో రాజధాని నిర్మాణం పేరుతో అమరావతిలో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఏమైందో అందరికీ తెలిసిందే.. ఇపుడు విషయం ఏమిటంటే అభివృద్ధిలో హైదరాబాద్‌తో పోటీపడాలని చంద్రబాబు చెప్పటంలో తప్పులేదు. ఎందుకంటే ఎన్ని అమరావతులు అయితే ఒక్క హైదరాబాద్ అవుతుందని జనాలు చెప్పుకుంటున్నారు కాబట్టి. హైదరాబాద్ స్థాయికి అమరావతి ఎప్పుడు డెవలప్ అవ్వాలి ? ఇపుడంతా స్పీడుయుగం కాబట్టి తక్కువలో తక్కువ 30 ఏళ్ళు పడుతుంది.



**రేవంత్ పోటీ కామెంట్స్ విచిత్రమే..**

అలాంటిది అభివృద్ధిలో చంద్రబాబుతో తాను పోటీపడాలని రేవంత్ అనటమే విచిత్రంగా ఉంది. రేవంత్ ఏమన్నారంటే 'పక్క రాష్ట్రం సీఎం చంద్రబాబుతో పోటీపడి ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు నడిపించే అవకాశం తనకు వచ్చింది' అన్నారు. గతంలో నేను 12 గంగలే పనిచేస్తే చాలని అనుకునేవాడిని. 'కాని ఇపుడు చంద్రబాబులాగా 18 గంటలు పనిచేస్తూ ఆయనతో పోటీపడాలని అధికారులు, సహచరులతో చెప్పాను' ఈ మాటలను మరి రేవంత్ ఏ మూడ్ లో చెప్పారో తెలీయటంలేదు. అభివృద్ధికి చంద్రబాబు ఎప్పుడూ నమూనాకాదు. కాకపోతే చంద్రబాబు అధికారంలో ఉంటే అభివృద్ధి బాగా జరుగుతుందనే ప్రచారం విపరీతంగా (చేయించుకున్నారు) జరిగింది. ఇపుడు విషయానికి వస్తే హైదరాబాద్‌తో పోటీపడాలని చంద్రబాబు చెబితే వినేవాళ్ళకు కూడా బాగుంటుంది. అంతేకాని అసలు అభివృద్ధిలో చంద్రబాబుతో పోటీపడాలని రేవంత్ చెప్పటమే పెద్ద జోక్‌గా తయారైంది. చంద్రబాబుతో పోటీపడే అవకాశం వచ్చిందని రేవంత్ అనటంలో గురుభక్తే ఎక్కువగా కనబడుతోంది. 75 ఏళ్ళ వయసులో చంద్రబాబు చేయగలిగే ఏపీ డెవలప్మెంట్ ఏమిటనేది ముందుముందు కాని తెలీదు. ఇదే సమయంలో రేవంత్ ఏమీ చేయకపోయినా పర్వాలేదు చెడకొట్టకుండా ఊరికేకూర్చుంటే చాలు హైదరాబాద్ అభివృద్ధిలో దూసుకుపోతుంది. కాకపోతే అభివృద్ధిలో మైనస్ హైదరాబాద్ మిగిలిన రాష్ట్రం జీరో అనే చెప్పాలి.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**మత్తుపదార్థాలను నిర్మూలించేందుకు ప్రత్యేక శ్రద్ధ : మంత్రి సీతక్క**




**విశ్వంభర, మహబూబాబాద్:** రాష్ట్రంలో డ్రగ్స్‌కు బానిసలుగా మారడంతో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మత్తుపదార్థాలను నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను సంపూర్ణంగా నిషేధించేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల నియామకాలను భర్తీ చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. విద్యాశాఖలో జిల్లా వ్యాప్తంగా కేవలం ఇద్దరు ఎంఈఓలు విధులు నిర్వహించడాన్ని చూస్తే గత పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోందన్నారు. దీంతో విద్యాశాఖ అధ్వానంగా మారిందని ధ్వజమెత్తారు. మహబూబాబాద్ జిల్లాలో భూకబ్జాదారులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. అసంపూర్తిగా ఉన్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఇది తొలి సమావేశం అయినందున అధికారులను సున్నితంగా మందలించామని, త్వరలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పట్ల దృష్టిసారించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ మురళి నాయక్, డాక్టర్ రామచంద్రు నాయక్, కోరం కనకయ్య, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి తెలంగాణ చేరుకున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు, పురుషోత్తం రెడ్డి

**– విశ్వంభర, ఆమనగల్లు**



## ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన పీఠాధిపతి రాజా గురువు

**విశ్వంభర, బషీర్ బాగ్:** మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా ఆది జాంబవ అరుంధతి మాత శక్తిపీఠం పీఠాధిపతి రాజా గురువు కలిసి శక్తి పీఠాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. గుడికి కావలసిన అన్ని సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అరుంధతి మాత శక్తిపీఠనికి సంబంధించిన పత్రాలు ఆయనకు సమర్పించారు. ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహాయ అందిస్తానని ఎంపీ స్పష్టం చేసినట్లు ఆయన వివరించారు.

## క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే శంకర్



**విశ్వంభర, షాద్‌నగర్ :** ఆర్టీసీ బస్సు సమస్యల గురించి షాద్‌నగర్ డిపోలో శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. స్కూళ్లు, కాలేజీలు పునః ప్రారంభించిన సందర్భంగా గతంలో నడుస్తున్న సర్వీసులను తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులను కోరారు. సిబ్బంది కొరత వున్నా నియోజకవర్గ వ్యాప్తంగా ఏ గ్రామానికి కూడా బస్సు సమస్య రావద్దని, అలాగే కాలేజీలకు హాజరయ్యే పిల్లలకు ఇబ్బందులు తలెత్తొద్దని ఆర్టీ సిబ్బందిని కోరారు. స్కూల్ విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు సెలవులు ఉన్న నేపథ్యంలో రద్దు చేయబడిన గతంలో నడిచిన బస్సు సర్వీస్‌లను పునఃరుద్ధరించాలని కోరారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పునరుద్ధరణపై మంత్రిని కలిసిన వినయ్‌రెడ్డి

- 173.80 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పునరుద్ధరణ, ప్రతిపాదనలు
- ఆర్మూర్ నియోజకవర్గంలో చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మంజూరు
- మిగిలిన పనులపై పునరుద్ధరణ కోసం నివేదిక
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిని కలిసిన ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలో చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనుల పునరుద్ధరణ కోసం, కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల విషయమై శుక్రవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పునరుద్ధరణ పై, కొత్త లిస్టులను మంజూరు చేయాలని కోరుతూ టెండర్లు పిలవడంపై ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై నందిపేట్ మండల కేంద్రంలోని నికాల్పూర్, మరంపల్లి, తల్వేద, వన్నెల్ (కే) పనుల పునరుద్ధరణ కోసం 4.83 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఈ పథకాల ఆయకట్టు కింద 1,4056 ఎకరాలు లబ్ధి చేకూరుతుందన్నారు. వీటికి టెండర్లు పిలిచారని, కానీ అగ్రిమెంట్లు కుదరకపోవడంతో ప్రభుత్వం నుంచి మంజూరు కోరుతున్నట్లు తెలిపారు. ఆర్మూర్ మండలం మచ్చర్ల లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణంతో 2860 ఎకరాల ఆయకట్టు రూపొందించేందుకు ఈ పథకం ద్వారా 40.40 కోట్లు టెండర్లు పిలిచి ఏజెన్సీని ఖరారు చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని 2860 ఎకరాల ఆయకట్టుకు ఈ పథకం దోహదపడుతుందని వివరించారు. అలాగే బినోల, కంఠం, చిక్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద నిజామాబాద్ జిల్లాలోని నవీపేట్, నందిపేట్, నందిపేట్ మండలంలోని ఎస్సారెస్పీ ముందు భాగంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణానికి 79.85 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ పథకం ద్వారా మాక్లూర్, నందిపేట్ మండలాల్లోని 5155 ఎకరాల ఆయకట్టుకు పథకం దోహదపడుతుందని తెలిపారు. ఈ పథకం ప్రారంభించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి కోరుతున్నట్లు చెప్పారు. ధర్మోరా లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో (గుత్ప అదనపు పథకం) ద్వారా మాక్లూర్ మండలం ధర్మోరాలోని 1000 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 11.71కోట్లతో నిజాంబాద్ జిల్లా పై లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిర్మాణం మంజూరు అయ్యిందని, కానీ ఈ పథకం పనులు 50 శాతం పూర్తయ్యాయని, మిగతా పనుల నిర్మాణం కోసం ప్రభుత్వం సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కంబైండ్ లిఫ్ట్ ఇరిగేషన్ కొత్త పథకాన్ని ఆర్మూర్ మండలం ఫతేపూర్ సమీపంలోని ఎస్సారెస్పీ ఫోర్ షోర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం చేపడితే పత్తేపూర్ లో 3700 ఎకరాలు, చిట్టాపూర్ లో 3474 ఎకరాలు, సుర్బిర్యాల్ గ్రామాల్లో 2040 ఎకరాల వద్ద ఆయకట్టుకు నీరు అందుతుందని, ఈ పథక నిర్మాణం ఒప్పందం కుదిరి 18 నెలలు గడుస్తున్న పనులు నెమ్మదిగా సాగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతోపాటు నిజామాబాద్ జిల్లా గుత్ప బ్యాలెన్సింగ్ ట్యాంక్ (మునుపెల్లి లిఫ్ట్) పై కొత్త పథకం ద్వారా స్కీం నిర్మాణానికి 23.80 కోట్ల ప్రభుత్వ పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చిందని చెప్పారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా మాక్లూర్, ఆర్మూర్, జక్రన్ పల్లి మండలాల్లోని 2423 ఎకరాల ఐడి పంటలకు నిరంతంచేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. అయితే అటవీ అనుమతుల కోసం ఏజెన్సీ గత 3 సంవత్సరాల నుండి పనులను నిలిపివేసిందని, స్టేజి 1 క్లియరెన్స్ లభించిందని, అటవీశాఖ అభివృద్ధి చార్జీల బిల్లు నిజామాబాద్ ఏపీఏఓ వద్ద 13.21 లక్షలు పెండింగ్లో ఉన్నాయని వాటి మంజూరు విషయమై ప్రభుత్వం దృష్టి సారించాలని మంత్రిని ఆయన కోరారు. నియోజకవర్గంలోని కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంల మంజూరు పెండింగ్లో ఉన్న పనుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం వెంటనే చొరవపాలని ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వినయ్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి పల్లకీ సేవ



**విశ్వంభర షాద్‌నగర్ :** మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామ స్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతి శర్మ, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాయికల్ మాజీ సర్పంచ్ ఆశన్న గౌడ్, శిరీష దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గోవులను పూజించారు. అనంతరం దేవాలయానికి వచ్చిన భక్తులకు పట్టణానికి చెందిన ఎం.కుమార్, లతా దంపతులు వారి కుమారుడు గౌతమ్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన వారిని పూలమాలతో సన్మానం చేశారు. దేవాలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలం గౌడ్, అంచ రాములు, వసంతరావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, రఘునందన్ రెడ్డి, లక్ష్మణ్, బచ్చన్న, కిషన్ నాయక్, రాఘవేందర్, సుప్ప నర్సింలు, శ్రీనివాస్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకర్ గౌడ్, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



**విశ్వంభర, కొత్తూరు :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడు తాను ముందుంటానని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తూరు మండలంలోని మక్తగూడలో ఎంపీపీ నిధులు రూ.6,80,000లతో ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు తన నిధులతో పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, విలేజ్ సెక్రెటరీ వెంకటేష్, మాజీ సర్పంచులు కాట్నా రాజు, రవి నాయక్, రాందాస్ నాయక్, మాజీ ఉపసర్పంచ్లు నరసింహారెడ్డి, జయేందర్ రెడ్డి, పాపిరెడ్డి, బోకుల శ్రీరాములు, దయ్యాల మల్లేష్, బోకుల రాజు, రాములు, ఎలుగని బాలయ్య, దయ్యాల పాండు, కట్నా శ్రీను, ఎలుగని శ్రీను, పసుల శ్రీశైలం, ముష్టి ఆంజనేయులు, సిద్ధం శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మేధా హైస్కూల్‌లో విద్యుత్ ఘాతానికి గురైన బాలుడు

**విశ్వంభర, షాద్‌నగర్ :** షాద్‌నగర్ లోని మేధా హైస్కూల్‌లో శనివారం 5వ తరగతి చదువుతున్న అర్మాన్ అనే విద్యార్థికి ఆవరణలో ఉన్న ట్రాన్స్ఫార్మర్స్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ బాలుడిని తల్లిదండ్రులు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. స్కూల్‌కి చేరుకున్న విద్యార్థి నాయకులు విద్యార్థులపై పాఠశాల యాజమాన్యం అశ్రద్ధ, మరియు నిర్లక్ష్య వైకరి వల్లే ఈ ఘటన జరిగిందని, ఈ పాఠశాలపై చర్యలు తీసుకుని గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



## నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**విశ్వంభర, కొల్లాపూర్:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తాలూకా మొలచింతలపల్లిలో ఆదివాసీ కుటుంబంపై పాశవిక దాడికి పాల్పడిన నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టమని మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను ఆయన పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితురాలిని, ఆమె భర్తను జరిగిన సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొలచింతలపల్లిలో ఆదివాసీ మహిళ ఈశ్వరమ్మను నిర్బంధించారు. పది రోజులుగా ఆమెను చిత్రహింసలు పెట్టారు. నిందితులను చట్టపరంగా శిక్షిస్తాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ఇలాంటి పాశవిక చర్యలు జరగడం బాధాకరం. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించడంతో పాటు వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వపరంగా కొంత భూమిని అందిస్తాం. వారి పిల్లలకు ప్రభుత్వ పరంగా విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటాం" అని జూపల్లి కృష్ణారావు తెలిపారు.





# ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీగా యువ ఐఏఎస్ కృష్ణతేజ

**విశ్వంభర, విజయవాడ :** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా యువ ఐఏఎస్ అధికారి మైలవరపు వీఆర్ కృష్ణతేజ రానున్నారు. ఏపీకి చెందిన కృష్ణతేజ ప్రస్తుతం కేరళలోని త్రిసూర్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్వస్థలం పల్నాడు జిల్లా చిలకలూరిపేట. సాధారణంగా ఆర్‌డీఓ స్థాయి అధికారులను మంత్రులకు ఓఎస్‌డీలుగా నియమిస్తారు. కానీ పవన్ కల్యాణ్ కోసం ఐఏఎస్ అధికారి అయిన కృష్ణ తేజ నియామకానికి సీఎం చంద్రబాబు ప్రత్యేక అనుమతి ఇచ్చారు. ఆయనను డిప్యూటేషన్‌పై రాష్ట్రానికి పంపాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కృష్ణతేజ గతంలో కేరళ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ, పర్యాటకశాఖ డైరెక్టర్, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్, అలప్పుజ కలెక్టర్‌గా సేవలందించారు. కాగా.. రెండు రోజుల క్రితం కృష్ణతేజ సచివాలయంలో పవన్ కల్యాణ్‌ను కలిసి వెళ్లారు. త్రిసూర్ కలెక్టర్‌గా కృష్ణతేజ అందించిన సేవలకు గాను జాతీయ బాలల రక్షణ కమిషన్ ఆయనను పురస్కారానికి ఎంపిక చేసింది. బాలల హక్కుల రక్షణలో త్రిసూర్ జిల్లాను ఆయన దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన కృష్ణతేజ.. 2023లో మార్చిలో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కరోనా కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన 609 మంది విద్యార్థులను గుర్తించి, దాతల సహకారంతో ఉన్నత చదువులకు చేయూత అందించారు.

కరోనా సమయంలో భర్తలను పోగొట్టుకున్న 35 మంది వితంతువులకు ఇళ్లు నిర్మించడంతో పాటు 150 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఐఏఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయన అద్భుత పనితీరుతో తనదైన ముద్ర వేస్తున్నారు.

# రైతు రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం

## ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే



**విశ్వంభర, ఢిల్లీ:** తెలంగాణ సర్కార్ రైతు రుణమాఫీ నిర్ణయం చారిత్రాత్మకమని ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే అన్నారు. రైతులపై మోడీ ప్రభుత్వం నల్ల చట్టాలతో వేధిస్తే.. కాంగ్రెస్ కిసాన్ న్యాయ్ కు కట్టుబడి ఉందన్నారు. రైతు రుణమాఫీ పై తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయంపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా రియాక్ట్ అయిన ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు. తెలంగాణలోని 40 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రుణమాఫీ చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మల్లికార్జున ఖర్గే హర్షం వ్యక్తం చేశారు. 16 సంవత్సరాల క్రితం, కాంగ్రెస్-యూపీఏ ప్రభుత్వం 3.73 కోట్ల మంది రైతులకు సంబంధించిన 72 వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలు, వడ్డీలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మాఫీ చేశామని గుర్తు చేశారు. ఒక వైపు మోడీ ప్రభుత్వం దేశంలోని రైతులపై మూడు నల్ల చట్టాలను విధించి, ముళ్ల తీగలు, డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు, లాఠీ దెబ్బలతో వెధిస్తుంటే.. మరోవైపు కాంగ్రెస్ పార్టీ "కిసాన్ న్యాయ్" కింద సరసమైన ధరలు, రుణమాఫీ కమిషన్, బీమా చెల్లింపుల ప్రత్యక్ష బదిలీ లాంటి న్యాయమైన వ్యవసాయ దిగుమతి- ఎగుమతి పాలసీకి హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. మా ఈ ఎజెండా చెక్కు చెదరకుండా ఉంటుందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.

# నిరుపయోగంగా ప్రభుత్వ అతిథి గృహం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రామన్నపేట నియోజకవర్గంగా ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి కాలంలో నిర్మించారు. ఈ ప్రభుత్వ అతిథి గృహన్ని కొన్ని సంవత్సలు ఉపయోగించుకొని ఆ తరువాత కాలంలో ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోకుండా ఉండటంతో నేడు ఆ అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుంటున్నది. అతిథి గృహం చుట్టూ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. గృహం లోను చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో ఊడ్చేవారు లేకుండా పోయింది. పిచ్చిమొక్కలు, కంప చెట్లు మొలచిలోనికి ప్రవేశం లేకుండా పోయింది. అతిథి గృహంలోని పర్నీచర్ వాడుకలో లేకుండా పోయి దుమ్ము దుళితో నిండిపోయి వస్తువులు పాడవుతున్నాయి. ఇప్పటివరకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఇపుడైన స్పందించి ప్రభుత్వ అతిథి గృహన్ని ఉపయోగంలోకి తీసుకురావలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



నల్లగొండ నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శరత్ చంద్ర పవర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదములు తెలియజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి మిరియాల యాదగిరి, నల్గొండ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ యువజన సంఘం అధ్యక్షులు మునాస ప్రసన్న కుమార్ మహిళా సంఘం అధ్యక్షురాలు సింగం లక్ష్మి తదితరులు.

– విశ్వంభర, నల్లగొండ

# ప్రాజెక్టులను తొందరగా పూర్తి చేయాలి

## శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి





**విశ్వంభర, నల్గొండ :** నల్గొండ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి రోడ్లు, భవనాలు శాఖ మంత్రి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డి తో కలిసి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలను సన్మానించారు. అనంతరం గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, మిషన్ భగీరథ ద్వారా అంతటా నీటి సరఫరా అవ్వడంలేదని, తన సొంత గ్రామంలోనే సగం గ్రామానికి మాత్రమే తాగునీటి సరఫరా అవుతుందని చెప్పారు. అలాగే జిల్లాలో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులు చివరి దశలో ఆగిపోయాయని, వాటికి త్వరగా నిధులను విడుదల చేస్తే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. డిండి,పెండ్లిపాకల, నక్కల గండి, ఉదయసముద్రం, ఎస్ఎల్‌బీసీ, ప్రాజెక్టులను తొందరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే ధర్మారెడ్డి, పిలాయి పల్లి కెనాల్స్ పనులు పూర్తయ్యాయి కానీ చివరి ఆయకట్టు వారికి నీరు రాకుండా కొందరు మోటార్లు, పైపు లైన్స్ ద్వారా అక్రమంగా నీటిని తీసుకొని వెళుతున్నారని అధికారులు త్వరగా స్పందించి నీటిని అక్రమంగా తీసుకువెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎస్‌డీఎఫ్ నిధులను విడుదల చేసి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. గతంలో మన ఊరు – మన బడి ప్రోగ్రాంలో పనులు ప్రారంభం అయ్యి అసంపూర్తిగా ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు.

# వ్యవసాయం దండగ కాదు పండుగ

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం





**విశ్వంభర, చింతపల్లి :** మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశానుసారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషమన్నారు. ఈ సంతోషకరమైన వార్తతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర రైతులు జేజేలు పలుకుతున్నారని వ్యవసాయం దండగ అనే సందర్భం నుండి వ్యవసాయం పండుగల చేసుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి చేశారన్నారు. రైతులు అభివృద్ధి చెందేవిధంగా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. చింతపల్లి మండల రైతుల పక్షాన సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఎంపీటీసీ సదానందం, కో ఆప్షన్ జహంగీర్ పాషా, మాజీ ఉపసర్పంచ్ సలీం, మాజీ ఎంపీటీసీలు కాసారపు శ్రీను, ఎలిమినేటి నరసింహ, గ్రామ అధ్యక్షుడు గోవిందు రవికుమార్, సిద్దిక్ బాబా, రాధా కిషన్, గోవిందు గిరి, జగదీష్, సతీష్, నరేష్, శ్రావణ్ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కూల్చివేత టీడీపీ నాశనానికి నాంది

- ఏపీ చరిత్రలో కూల్చివేతలు మచ్చలా నిలిచిపోతుంది
- కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరిస్తున్నారు
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



**విశ్వంభర, గుంటూరు:** తాడేపల్లిలో వైసీపీ కార్యాలయ భవనాలను అధికారులు కూల్చివేయడం పట్ల మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు స్పందించారు. తాడేపల్లిలోని తమ పార్టీ కార్యాలయాన్ని టీడీపీ ప్రభుత్వం దౌర్జన్యంగా, కోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ కూల్చివేసిందని ఆరోపించారు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక మాయని మచ్చలా మిగిలిపోతుందని అన్నారు. "జగన్ కూడా గతంలో కూల్చారు కదా... మరి ఇప్పుడు కూల్చితే తప్పేంటి? అని కొందరు కుహనావాదులు అంటున్నారు. ఇలాంటి వాదనలు చాలా ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. నాడు ఏదైతే ప్రజావేదికను కూల్చామో... అది నదీ గర్భంలో అక్రమంగా కట్టిన నిర్మాణం. చంద్రబాబు ఉంటున్న భవనం కూడా నదీ గర్భంలో అక్రమంగా కట్టినదే. చంద్రబాబు హయాంలో అనేక నిర్మాణాలను నదీ గర్భంలో కట్టారు. వాటన్నింటిపైనా కోర్టుల్లో విచారణ జరిగింది. కోర్టులు చెప్పడంతో వాళ్లకు అడ్డుకట్ట పడింది. మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం కూడా ఓ కాలువపై కట్టారు. ఇవాళ కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరిస్తూ కూల్చివేతలకు పాల్పడతారా? ఇక రాజ్యాంగంతో పని లేదా? న్యాయస్థానాలతో పని లేదా? మీరు ఏది అనుకుంటే అది చేస్తారా? ఇవాళ తాడేపల్లిలో వైసీపీ కార్యాలయ కూల్చివేత టీడీపీ నాశనానికి నాంది పలుకుతుంది. గత మూడు వారాలుగా రాష్ట్రంలో విధ్వంసానికి పాల్పడుతున్నారు. గ్రామాల్లోని సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను, హెల్త్ క్లినిక్ లను ధ్వంసం చేస్తున్నారు. శిలాఫలకాలను, వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. రోడ్లను సైతం తవ్వేస్తున్నారు. వ్యక్తుల మీద భౌతికంగా దాడులు చేస్తున్నారు. మేం ఓపిక పడతాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. 2019లో మిమ్మల్ని నేలమట్టం చేసి మాకు ప్రజలు బ్రహ్మాండమైన మెజారిటీ ఇచ్చారు. ఈసారి మమ్మల్ని కాదనుకుని మరింత పెద్ద ఎత్తున మీకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. మన ప్రవర్తనను బట్టి ప్రజల తీర్పులు కూడా మారుతూ ఉంటాయి. ఇవాళ వైసీపీ కార్యాలయ కూల్చివేత ద్వారా టీడీపీ పతనానికి వాళ్లే శ్రీకారం చుట్టుకున్నారు. రాష్ట్రంలో ఉన్న మేధావులు, ప్రతి ఒక్క విద్యావంతుడు దీనిపై స్పందించాలని కోరుతున్నా" అని సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు.



శనివారం బీజేపీ రాష్ట్ర ఆఫీస్ హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపి సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు అన్నవరపు సత్యనారాయణ, పార్టీ నాయకులు.

– విశ్వంభర, హైదరాబాద్



# రాజధాని నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం

## బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించిన సీఎం చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి:** మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో విధ్వంసానికి గురైన ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతికి విరాళాలు ఇవ్వడానికి రాష్ట్ర నలుమూలల నుంచి చాలా మంది ముందుకు వస్తున్నారు. తాజాగా ఏలూరులోని ముదినేపల్లికి చెందిన అంబుల వైష్ణవి ఓ వైద్య విద్యార్థిని అమరావతి, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు శనివారం విరాళం ఇచ్చారు. అంబుల వైష్ణవి ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబుని కలిసి విరాళం అందించారు. అమరావతి నిర్మాణానికి రూ.25 లక్షలు, పోలవరం ప్రాజెక్టుకు రూ.1 లక్ష చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకి అందజేశారు. తమకున్న మూడు ఎకరాల భూమిలో ఎకరం పొలం అమ్మగా రూ.25 లక్షలు వచ్చాయని వాటిని రాజధానికి, తన బంగారు గాజులు అమ్మగా వచ్చిన రూ.లక్షను పోలవరానికి విరాళంగా అందించినట్లు వైష్ణవి చెప్పారు. 'రాజధానిని నిర్మిద్దాం-రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం' అనే ఆలోచనతో పనిచేస్తున్న ప్రభుత్వానికి తనవంతు సాయం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. లాభాపేక్ష లేకుండా విరాళం ఇచ్చి,స్ఫూర్తి నింపిన వైష్ణవిని రాజధాని అమరావతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.



# అయ్యన్న పాత్రుడు అంటే అందరి పాత్రుడు

- రాజకీయాలపై మంచి అనుభవం
- మంత్రి నారా లోకేష్

**విశ్వంభర, విజయవాడ:** ఏపీ 16వ శాసనసభ స్పీకర్‌గా చింతకాయల అయ్యన్నపాత్రుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రశంసిస్తూ మంత్రి నారా లోకేశ్ శాసనసభలో మాట్లాడారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడితో కలిసి పనిచేసే అవకాశం తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని లోకేశ్ అన్నారు. అయ్యన్నపాత్రుడు అంటే అందరి పాత్రుడు అని అన్నారు. ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచించే వ్యక్తి అయ్యన్న అని తెలిపారు. వైసీపీ హయాంలో కక్షగట్టి అయ్యన్న ఇంటిని కూలగొట్టినా, కేసులు పెట్టినా తగ్గకుండా పోరాడారని కొనియాడారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆయనకు చాలా అనుభవం ఉందన్నారు. 25 ఏళ్ల వయసులో మంత్రిగా ఎన్నికయ్యారని, 16 ఏళ్లు మంత్రిగా పని చేసిన అనుభవం అయ్యన్నపాత్రుడికి ఉందన్నారు. ఇక గతంలో సభ ఎంతో హుందాగా జరిగేదని, గత ఐదేళ్లు శాసనసభపై గౌరవం తగ్గేలా వైసీపీ వ్యవరించిందంటూ దుయ్యబట్టారు. సభ సంప్రదాయాలను గౌరవించేలా.. సభ ప్రతిష్ట పెరిగేలా సభ్యులను గైడ్ చేయాలని లోకేశ్ స్పీకర్‌ను కోరారు. అయ్యన్న నాయకత్వంలో అనేక మంచి పనులు జరిగాయని గుర్తు చేశారు. అయ్యన్నపాత్రుడి నుంచి నేర్చుకోవల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయన్నారు. తనకు ఎప్పుడు సలహా కావాలన్నా ఆయనను సంప్రదించానని లోకేశ్ తెలిపారు. ఒకే పార్టీ, ప్రజలే అజెండాగా అయ్యన్న ముందుకెళ్లారన్నారు. ఆయన ఆధ్వర్యంలో సభను గౌరవప్రదంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. స్వపక్షమే ప్రతిపక్షంలా మారి ప్రజల సమస్యలపై సభలో చర్చిస్తామన్నారు.



## నిరుపేదలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఓదార్పు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** నేషనల్ హైవే పనుల్లో భాగంగా హయత్‌నగర్ ప్రధాన రహదారిలో రేడియో స్టేషన్ ప్రక్కన కొన్ని సంవత్సరాలుగా నిరు పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం నేషనల్ హైవే సిబ్బంది, జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులు ఆ గుడిసెలు తొలగించారు. బాధితులు శనివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించారు. వెంటనే ఎమ్మెల్యే సంఘటన స్థలానికి చేరుకుని పలువురు బాధితులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆ స్థలం నుంచి ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ గణపతి రెడ్డితో ఫోన్లో మాట్లాడుతూ.. ప్రస్తుతం గుడిసెలు వేసుకొని నివసిస్తున్న స్థలంలో గతంలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గుడిసెలు కులగొట్టి వారి జీవనోపాధి మీద దెబ్బకొట్టొద్దని కోరారు. బాధితులకు కొంత గడువు ఇవ్వాలని, అలాగే వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దానికి చీఫ్ ఇంజనీర్ మాట్లాడుతూ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దానికి గుడిసెవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల రెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డి, నక్క రవీందర్ గౌడ్, చెన్నగోని శ్రీధర్ గౌడ్, భాస్కర్ సాగర్, మల్లీశ్వరి రెడ్డి, మల్లేష్ ముదిరాజ్, కృష్ణరెడ్డి, సైలాబ్, సందీప్, చంద్రారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మధు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కాళేశ్వర ఆలయాన్ని దర్శించిన దేవాదాయ స్థపతి



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలోని శిథిలమైన విగ్రహాలను ఎక్కడ ఉంచాలి, అలాగే ఆలయం నుంచి బయటకు వచ్చే భక్తులు సరస్వతి అమ్మవారి ఆలయ దర్శనమునకు ఎలా వెళ్ళాలి సంబంధిత విషయాలపై దేవాదాయ స్థపతి వల్లినాయగం, ఎస్ఈ మల్లిఖార్జున్‌రెడ్డి, డీఈ రమేశ్, ఏఈ దుర్గాప్రసాద్ కాళేశ్వర ఆలయ కార్యనిర్వహణా ధికారి మారుతి, ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్, అర్చకులతో సమావేశమై చర్చించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ విషయాలపై దేవాదాయ కమిషనర్‌తో సమగ్రంగా చర్చించి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి పంపిస్తామని తెలిపారు.



## ఘనంగా గోదావరి పౌర్ణమి హారతి

**విశ్వంభర, భూపాలపల్లి :** దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హైదరాబాద్ ఆదేశాల మేరకు ప్రతీ నెల పౌర్ణమి రోజున భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరిలో నదీ హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో, గోదావరి నది వద్దకు వెళ్లి వేద పండితులు, అర్చకులు, గోదావరి నదీ హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ బుర్రి శ్రీనివాస్ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు, సేవాసమితి, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** బొగ్గు గనుల కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జీ కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిని శనివారం బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రధారి తుమ్మల మురలీధర్ రెడ్డి, ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి తదితరులు ఉన్నారు.

# మూడు చట్టాల అమలు వాయిదా వేయాలి

- ఆ బిల్లులను చర్చలు లేకుండా మొండిగా ఆమోదించారు
- కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్



**విశ్వంభర, ఢిల్లీ:** మూడు క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయవలసిందని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ శనివారం కోరారు. ఆ బిల్లులను పార్లమెంట్ ద్వారా 'చర్చలు లేకుండా మొండిగా ఆమోదింపచేశారు' అని రమేష్ ఆరోపించారు. ఆ చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి రావలసి ఉంది. 146 మంది ఎంపిలు సస్పెండ్ అయిన సమయంలో బిల్లులను ఆమోదించినందున పునర్వ్యవస్థీకరించిన హోమ్ శాఖ స్థాయీ సంఘంసమగ్ర సమీక్ష, పునఃపరిశీలన జరపడానికి వీలుగా వాటి అమలును వాయిదా వేయాలని రమేష్ 'ఎక్స్' పోస్ట్‌లో సూచించారు. '2023 డిసెంబర్25న రాష్ట్రపతి 2023 భారతీయ న్యాయ సంహిత, 2023 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023 భారతీయ సాక్ష అభినియంలకు ఆమోదముద్ర వేశారు, విస్తృత ప్రయోజనాలకు ఉద్దేశించిన ఆ బిల్లులను సరైన చర్చ లేకుండానే, లోక్‌సభ, రాజ్యసభ నుంచి 146 మంది ఎంపిలను సస్పెండ్ చేసిన సమయంలో పార్లమెంట్ ద్వారా మొండిగా ఆమోదించారు' అని రమేష్ పేర్కొన్నారు. 'ఇంతకుముందు దేశవ్యాప్తంగా సంబంధిత వ్యక్తులతో సమగ్ర చర్చ లేకుండానే, స్థాయీ సంఘం సభ్యులైన భారత జాతీయ కాంగ్రెస్‌తో సహా వివిధ రాజకీయ పార్టీలకుచెందిన పలువురు ఎంపిల లిఖిత, అత్యంత వివరణాత్మక పత్రాలను పూర్తిగా అలక్ష్యం చేసి హోమ్ శాఖ స్థాయీ సంఘం ద్వారా బిల్లులను ఆమోదింపచేశారు' అని ఆయన ఆరోపించారు, మూడు కొత్త చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి రానున్నాయని, పునర్వ్యవస్థీకరించిన హోమ్ శాఖ స్థాయీ సంఘం ద్వారా ఆ చట్టాల సమీక్ష, పునఃపరిశీలన జరగడానికి వీలుగా వాటి అమలు తేదీ మార్చాలని కాంగ్రెస్ గట్టిగా భావిస్తోందని రమేష్ తెలియజేశారు.

# ఫుడ్ సేఫ్టీపై అవగాహన కల్పించాలి

- నిరంతర పర్యవేక్షణ, నిఘా పెట్టాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాదులోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, బ్లడ్ బ్యాంక్‌ల, ఎఫ్ఎస్ఎస్ఏఐ యాక్ట్ అమలుతో పాటు అన్ని విభాగాలను బలోపేతం చేయడానికి ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయడం పై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫుడ్ సేఫ్టీ పై నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించడం వల్ల నాణ్యమైన ఆహారం అందించడంలో దేశంలోనే తెలంగాణ ఉత్తమ రాష్ట్రంగా గుర్తింపు లభిస్తుందన్నారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందేలా ఆహార పరిరక్షణ అధికారులు నిరంతరం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు లోని హాస్టల్స్, క్యాంటీన్లతో పాటు అన్ని ఆసుపత్రులలో ఉన్న క్యాంటీన్లలో ఫుడ్ సేఫ్టీ పై నిరంతర పర్యవేక్షణ, నిఘా పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థల తో పాటు ఆసుపత్రిలో ఉన్న క్యాంటీన్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌లను తీసుకునేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారాలను ఆదేశించారు. మొబైల్ ఫుడ్ టెస్టింగ్ లాబ్‌ల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశిం చారు. ఫుడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిం చాలన్నారు.. నాచారంలో ఉన్న ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ ను బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బ్లడ్ బ్యాంకులను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. తెలంగాణ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ను బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎన్‌హెచ్ఎంకు రావలసిన నిధులను విడుదలకు కృషి చేయాలని మంత్రి అధికారుల ను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖలో అన్ని విభాగాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు ఆదేశం..



అన్ని విభాగాలను పటిష్ఠ పరిచేం దుకు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.




## వివేకానంద విదేశీ విద్య పథకం పైసలు
# వెంటనే విడుదల చేయాలి

**వక్కలంక శ్రీనివాస్ రావు**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో వివేకానంద విదేశీ విద్యా పథకం ద్వారా మంజూరు పత్రాలు పొంది ఆరు నెలలైనా పైసలు రిలీజ్ కాకపోవడంతో వందలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిధులు విడుదల చేయాలని రాష్ట్ర తెలంగాణ బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడిచేర్ల నాగేశ్వర సిద్ధాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్ట్ కార్డ్స్ ఉద్యమాన్ని ఆయన ప్రారంభించారు. అనం తరం మాట్లాడుతూ.. అన్నిసంఘల వాళ్ళు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, ప్రతి బ్రాహ్మణుడు ఒక పోస్ట్ కార్డును పంపించాలని అన్నారు. వక్కలంక శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. "బ్రాహ్మణ సంక్షేమ పరిషత్" లో వివేకానంద విదేశీ విద్యా పథకం ద్వారా మంజూరు పత్రాలు పొంది ఆరు నెలలైనా.. ఇంకా అమౌంట్ రిలీజ్ కాకపోవడంవల్ల వందలాది మంది అప్పులు చేసి విదేశాలకు ఉన్నత చదువులకు పంపిన విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకుని వ్యాపారాల నిమిత్తం బెస్ట్ స్కీంకి సాంక్షన్ చేసి నిధులను వెంటనే విడుదలకు ఆదేశాలు జారీ చేయలని అన్నారు. త్వరలో హైదరాబాద్‌లో అన్ని సంఘాల వారితో పోస్ట్ కార్డ్స్ ఉద్యమాన్ని మొదలపెడతామని అయన అన్నారు. మీ మీద ఎంతో విశ్వాసంతో మిమ్మల్ని మా నాయకులుగా ఎన్నుకున్నాం, బ్రాహ్మణులు సమాజహితం కోరుకునేవారు అలాంటి పేద బ్రాహ్మణులను మీరు ఆదుకుంటారని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమంలో స్త్రీ శక్తి అనురాధ, నాగరాజ్, పవన్, రఘునందన్ పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సుదర్శన హోమం



**విశ్వంభర, చివ్వేంల :** క్రోధినామ సంవత్సర జ్యేష్ఠమాస పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఉండ్రుగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీ సుదర్శన సహిత శ్రీలక్ష్మీనరసింహ హోమం నిర్వహించారు. పురోహితులు కిరణ్ కుమారాచార్యులు యాజ్ఞికములో ఆలయపూజారులు శ్రీమాన్ కృష్ణమాచార్యుల సహకారంతో అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన 13 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. యాగానంతరం తీర్థ ప్రసాదములతోపాటు సుమారు 200 మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పూజలకు వచ్చిన భక్తులకు సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం

**విశ్వంభర, ఆమనగల్లు :** నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రానికి చెందిన మెకానిక్ పాండు ఇటీవల మరణించారని గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధ్యాప వెంకటయ్య, అన్యపు రామస్వామి, మెరుగు విష్ణు, వేముల వెంకటేష్, ఎండీ అమీద్, తిరుపతి రెడ్డి, ఈదులపల్లి ఆనంద్, బాధపెల్లి రామకృష్ణ, బొక్కల చంద్రశేఖర్, భరత్‌గౌడ్ పాల్గొన్నారు.




## బడి బస్సుల తనిఖీలు

**విశ్వంభర, చింతపల్లి :** మండలంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్కూల్ బస్సులను ఫిట్నెస్ లేకుండా నడిపితే కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తామని అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్ హెచ్చరించారు. చింతపల్లి మండల కేంద్రంలో శనివారం ప్రైవేట్ స్కూల్ బస్సుల రెన్యూవల్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఫిట్నెస్ లేని నాగార్జున గ్రామర్ స్కూల్ బస్సుని సీజ్ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ బస్సులు ఫిట్నెస్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు, తిరిగి ఇంటికి చేర్చే వరకు భద్రంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే బస్సులను సీజ్ చేస్తామన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ సరైన పత్రాలతో పాటుగా బస్సులను కండిషన్లో పెట్టుకొని బస్సులు నడపాలన్నారు. కనీసం ఐదు సంవత్సరాల అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా డ్రైవర్ ప్రవర్తన, బస్సులు కండిషన్లో ఉన్నాయా లేవా అనేది చూసుకోవాలన్నారు. విద్యార్థులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చే బాధ్యత ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లదే అని ఆయన పేర్కొన్నారు.



# కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**విశ్వంభర, అంబర్‌పేట్ :** 156 మంది అర్హులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను అంబర్‌పేట్ ఎస్ఆర్ జి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, తమకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ అమృత, ఎమ్మార్వో ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం




**విశ్వంభర, ఆలేరు :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి వారి పాదాల వద్ద, ఆలేరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఒకే దఫా రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషమన్నారు. ఈ సంతోషకరమైన వార్తతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు జేజేలు పలుకుతున్నారని, వ్యవసాయం దండగ అనే సందర్భం నుంచి వ్యవసాయం పండుగల చేసుకునే విధంగా సీఎం చేశారన్నారు. రైతులు అభివృద్ధి చెందేవిధంగా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. ఆలేరు నియోజకవర్గ రైతుల పక్షాన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 'చిట్టి' తల్లికి చేయూతనిచ్చిన ఉప్పల

**విశ్వంభర, ఆమనగల్లు :** రంగారెడ్డి జిల్లా మండలం తలకొండపల్లి పాతకుంట తండాకు చెందిన చిట్టీ అనే అమ్మాయి తల్లితండ్రి చనిపోవడంతో తన తాత దగ్గర ఉండి చదువుకున్నది. తాతయ్యకు వయసు పైబడడం ఊరిలో పైతరగతులు లేకపోవడంతో భారంగా మారిన చిట్టి చదువు కోసం చిట్టి తాత తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను ఆశ్రయించగా ఆయన వెంటనే స్పందించి ఉప్పల ట్రస్ట్ ట్రస్ట్ ద్వారా ఆమనగల్లులోని ప్రజ్ఞ ప్రైవేటు పాఠశాల యజమాన్యంతో మాట్లాడి విద్యార్థి చిట్టిని పైతరగతులకు చదవడానికి చేర్పించారు.

## 24న అంగన్వాడీల ధర్నా జయప్రదం చేయాలి
### పల్లా దేవేందర్ రెడ్డి



**విశ్వంభర, దేవరకొండ :** అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కరించకుండా తీవ్ర ఇబ్బందుల గురిచేసిం దని ఆ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 24 రోజుల సమ్మె చేస్తే కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీ సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా అంగన్వాడీలకు తక్షణమే 18 వేల వేతనం చెల్లించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్‌కు రూ.5 లక్షలు చెల్లిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు లక్ష రూపాయలు, ఆయాకు రూ.50 వేలు మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుం టుందన్నారు. అంగన్వాడీలపై పనిభారం తగ్గించాలని, పె రుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఖాళీగా ఉన్న సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలని తదిత ర డిమాండ్లతో ఈనెల 24 న జరిగే ధర్నాలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన జయప్రదం చేయాలని దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు.



# ఆంజనేయ భక్తులపై శఠగోపం

**విశ్వంభర, కల్వకుర్తి :** "ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు" అనే సామెత ఊర్కొండ మండలం ఊ ర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయ పూజారులకు సరిగ్గా అతికినట్లు సరిపోతుంది. తమకు నచ్చిన వారు. డబ్బులు ఇచ్చే వారికి పెద్దపీట వేస్తూ.. సామాన్య భక్తులకు చుక్కలు చూపిస్తున్నారనే విమర్శలను వారు మూటగట్టుకుంటున్నారు. ఆలయ పూజారులు తమకు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆలయ నిర్వహణ అంతా దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నా.. ఇక్కడ మాత్రం పూజారులదే పెత్తనం అని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూజారులను ప్రక్షాళన చేస్తే తప్ప మరో మార్గం లేదని భక్తులు పేర్కొంటున్నారు. నెలలో ప్రతీ శనివారం, మంగళవారం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. అయితే ఆలయంలోని పూజారుల తీరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబ్బులిచ్చేవారు.. తెలిసిన వారు వస్తే వారిని గర్భగుడిలోకి ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సామాన్య భక్తులు మాత్రం క్యూలో వేచి ఉండి స్వామిని దర్శించుకోవాల్సి వస్తుంది. ఇదే మని అడిగితే వీఐపీలని చెబుతున్నారని పలువురు భక్తులు వాపోతున్నారు. మరో విచిత్రమైన విషయం ఏమిటంటే ఆలయానికి వచ్చిన భక్తులను పూజారులు దక్షిణ ఇవ్వాలని బేషరతుగా అడుగుతున్నారు. భక్తితో స్వామిని దర్శిం చుకుందామని వస్తే.. కాసులిస్తేనే పట్టించుకుంటారా..? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



# అసంపూర్తి అంగన్వాడీ భవనాలను పూర్తి చేయాలి

**విశ్వంభర, చింతపల్లి :** అసంపూర్తిగా నిలిచిన అంగన్వాడీ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ చింతపల్లి జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు బండా నరేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన సర్వ సభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇట్టి సమావేశానికి తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కోసం న్యాణమైన సన్న బియ్యం సరఫరా చేయాలని కోరారు. గ్రామాల్లో కొన్ని చోట్ల మిషన్ భగీరథ నీళ్ళు సరిగా రాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె అన్నారు. అధికారులు స్పందించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు.

# సారా రహిత తెలంగాణే లక్ష్యం

**విశ్వంభర, ఆమనగల్లు :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో తెలంగాణ ప్రభుత్వం గుడుంబా రహిత తెలంగాణ చేయుటలో భాగంగా పబ్లిక్‌ను అవేర్నెస్ చేయడం కోసం ఆమనగల్లు ఎక్సైజ్ శాఖ మరియు ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించింది. తలకొండపల్లి మండలంలో చుక్కాపూర్, చీపునం తల, తుమ్మలకుంట తండాల్లో నాటు సారా తయారీ చేస్తున్న వారి ఇండ్లలో తనిఖీలు చేసి ముడ్వా తండ్రి గుడియాని అరెస్ట్ చేశారు. అదేవిధంగా కడ్తాల్ మండలంలో సలార్పూర్ తండాలో ఇద్దరిని అరెస్ట్ చేసి మొత్తంగా 7 లీటర్ల సారా సీజ్ చేసి 100 లీ. బెల్లం ధ్వంసం చేసినట్లు అని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బైద్యనాథ్ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.











# రాష్ట్రాల అభివృద్ధికి తోడ్పాటు

- చిన్న వ్యాపారులకు మేలు చేసేలా నిర్ణయాలు
- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్

**విశ్వంభర, ఢిల్లీ :** చిన్న వ్యాపారులకు మేలు చేసేలా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకున్నదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. త్వరలో బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. జీఎస్టీపై ట్రిబునళ్లు, కోర్టుకు వెళ్లే ట్రాన్సాక్షన్ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశం తర్వాత నిర్మలా సీతారామన్ మీడియాకు చెప్పారు. అలాగే వ్యాపారులు జరిమానా చెల్లించడంలో ఆలస్యమైతే, దానిపైన వడ్డీ కూడా చెల్లించాల్సి ఉందని, దీన్ని ఎత్తేయాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మార్పులు చేయాలని నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రత్యేకించి, ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మోసాలు జరుగకుండా ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి అమలు చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. అన్ని రకాల కార్టన్ బాక్సులపై జీఎస్టీ 12 శాతానికి కుదించడం ద్వారా ఆపిల్, ఇతర పండ్ల వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు. స్ప్రింకర్లు, సోలార్ కుక్కర్లపై జీఎస్టీ 12 శాతానికి తగ్గించాలని కూడా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 73 నిబంధన కింద విధించే జరిమానాలపై ప్రధానంగా చర్చించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. గతేడాది అక్టోబర్ తర్వాత జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరుగడం ఇదే తొలిసారి అని నిర్మలా సీతారామన్ చెప్పారు. సార్వత్రిక ఎన్నికల వల్ల చాలా కాలం తర్వాత జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిందని తెలిపారు. శనివారం చర్చించిన అంశాలపై పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తర్వాత మరోమారు చర్చిస్తాం జీఎస్టీ కౌన్సిల్ సమావేశమై ఈ రోజు చర్చించిన అంశాలపై తుది నిర్ణయం తీసుకుంటుందని నిర్మలా సీతారామన్ చెప్పారు.



# జమ్మూ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

## ఇద్దరు ఉగ్రవాదులు హతం

**విశ్వంభర, కశ్మీర్:** ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్ల జిల్లాల్లో చొరబాటు ప్రయత్నాలను భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. ఉరీలోని గోహ్లన్ ప్రాంతంలో శనివారం ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నించగా.. ఇద్దరిని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ప్రస్తుతం సంఘటనా స్థలంలో ఇంకా ఉగ్రవాదులు, సైన్యం మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉగ్రవాదుల ఆచూకీ తెలియరాలేదు. వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇంతకు ముందు ఈ నెల 21న భద్రతా దళాలు ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు పాకిస్థానీ ఉగ్రవాదులను హతమార్చాయి. ఇద్దరికీ లష్కరే తోయిబాతో సంబంధాలను ఉన్నట్లుగా గుర్తించారు. ఉత్తర కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచేందుకు పాక్ కుట్ర పన్నుతున్నట్లుగా గుర్తించారు. 2005 నుంచి 2015 వరకు ఈ ప్రాంతంలో ఉగ్రవాదం వ్యాపించింది. అయితే, 2019లో జమ్మూ కశ్మీర్ పోలీసుల ప్రచారంలో బారాముల్లా జిల్లాను ఉగ్రవాద రహితంగా ప్రకటించారు. భద్రతా సంస్థల ప్రకారం, స్థానిక ఉగ్రవాదుల కంటే పాకిస్తాన్ మూలాలు ఉన్న విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఇప్పటికీ ఎక్కువగా ఉంది. అయితే, వారిని క్రమంగా నిర్మూలిస్తూ వస్తున్నారు. అమర్‌నాథ్ యాత్ర కోసం జమ్మూ కశ్మీర్‌లో పారామిలటరీ బలగాను మోహరించారు. ఈసారి జమ్మూ జిల్లాకు 24 కంపెనీల అదనపు పారామిలటరీ బలగాలను తరలించారు. ఇది గతేడాది కంటే ఐదు నుంచి ఆరు కంపెనీల కంటే ఎక్కువ. అమర్‌నాథ్ యాత్ర మార్గం, యాత్రికుల బస స్థలాలు, లంగర్లు తదితర ప్రాంతాల్లో మోహరించడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో తొలిసారిగా పారామిలటరీ బలగాలను కేంద్రం మోహరిస్తున్నది.

# 22 మంది అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్



**విశ్వంభర, పంజాబ్:** పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు చెందిన పోలీసులు భారీ కుట్రను భగ్నం చేశారు. సుమారు 22 మంది అనుమా నిత ఉగ్రవాదులను అరెస్టు చేశారు. ఆ ఉగ్రవాదులు ఐఎస్ఐఎస్, టీటీపీతో పాటు ఇతర నిషేధిత సంస్థలకు చెందినట్లు గుర్తించారు. కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్ ప్రతినిధి దీని పై మాట్లాడుతూ.. ఇంటెలిజెన్స్ శాఖ ఇచ్చిన సమాచారం ఆధారంగా పంజాబ్‌లోని వేర్వేరు జిల్లాల్లో సుమారు 152 ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించామని, ఐఎస్ఐఎస్, తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్, బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ, లష్కరే ఈ జాంగ్వీ గ్రూపులకు చెందిన 22 మంది అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు చెప్పారు. లాహోర్, అటాక్, షేక్‌పు రా, ముజాఫర్‌ఘర్, నాన్‌కానా సాహిబ్, బవల్‌పూర్, డీజీ ఖాన్, ఫైసలాబాద్, ముల్తాన్, భవాల్‌నగర్, రావల్పిండి నుంచి వాళ్లను అదు పులోకి తీసుకున్నారు. ఉగ్రవాదుల వద్ద నుంచి 1645 గ్రాముల పేలుడు పదార్థాలు, మూడు హ్యాండ్ గ్రానేడ్లు, ఒక ఐఈడీ బాంబు, 12 డెటోనేటర్లు, పిస్తోల్, నిషేధిత సాహిత్యాన్ని సీజ్ చేశారు. అనుమానిత ఉగ్రవాదులు పంజాబ్‌లో అఘాయిత్యానికి ప్లాన్ వేశారు, రాష్ట్రంలో ఉన్న కీలక ప్రదేశాలను, వ్యక్తులను టార్గెట్ చేయాలని భావించారు. ఉగ్రవాదులుపై 18 కేసులు బుక్ చేసినట్లు పోలీసులు వెల్లడిం చారు. విచారణ నిమిత్తం ఆ ఉగ్రవాదులను గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు.

# ఇకపై వారికి ఈ-వీసా సదుపాయం

- భారత్‌కు వచ్చి చికిత్స పొందే వీలుంటుంది
- కొత్తగా అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తాం
- భారత్- బంగ్లాదేశ్ మధ్య కీలక ఒప్పందాలు
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



**విశ్వంభర, ఢిల్లీ :** భారత్- బంగ్లాదేశ్ ల ఆర్థిక వ్యవస్థల బలోపేతమే లక్ష్యంగా ఇరు దేశాల నేతలు చర్చించారు. రెండ్రోజుల భారత్ పర్యటన కోసం వచ్చిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడారు. మధ్య ఇరుదేశాల మధ్య వాణిజ్య, సహకార సంబంధాల బలోపేతానికి కృషి చేస్తామని మోడీ తెలిపారు. 'గత పదేళ్లలో ఇరుదేశాల మధ్య 1965 నాటికి ముందున్న సంబంధాలను పునరుద్ధరించామన్నారు. ఇకపై డిజిటల్, ఎనర్జీ కనెక్టివిటీపై దృష్టి పెడతామన్నారు. దీంతో, ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు పటిష్టమవుతాయన్నారు. భారత్-బంగ్లా మధ్య రక్షణ సహకారం, సాయుధ బలగాల ఆధునీకరణ అంశాలపైనా చర్చించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. సరిహద్దుల్లో ఉగ్ర కార్యకలపాలను అడ్డుకొని శాంతి స్థాపనకు కృషి చేయాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలిపారు. 'ఇండియన్ ఓషన్ రీజియన్' అంశంలోనూ భారత్‌కు తోడుగా నిలిచేందుకు బంగ్లాదేశ్ ముందుకు రావడాన్ని స్వాగతించామన్నారు. 'బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోపరేషన్ తోపాటు ఇతర అంతర్జాతీయ ఫోరమ్‌ల విషయంలోనూ ఇదే సహకారాన్ని కొనసాగిస్తామన్నారు. వరదల నిర్వహణ, ముందస్తు హెచ్చరికలు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో పరస్పరం సహకరించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 1996 నాటి గంగా జలాల ఒప్పందాన్నే అనుసరిస్తున్నామని, దీనిలో కొన్ని మార్పులు చేయాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. దీని కోసం భారత్ నుంచి ఓ సాంకేతిక బృందం త్వరలోనే బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతుందని చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి చికిత్స కోసం భారత్‌కు రావాలనుకునే వారికి ఇకపై ఈ-వీసా సదుపాయాన్ని కల్పిస్తామని మోడీ అన్నారు. దీనికోసం రంగ్‌పుర్ లో కొత్తగా అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దీంతో, సులువుగా భారత్‌కు వచ్చి చికిత్స పొందే వీలుంటుందని చెప్పారు. బంగ్లాదేశ్‌తో సంబంధాలకే భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.



# బీహార్‌లో కూలిన మరో వంతెన

## వారం రోజుల్లోనే రెండో ఘటన

**విశ్వంభర, బీహార్ :** బీజేపీ-జేడీయూ కూటమి పాలనలోని బీహార్ రాష్ట్రంలో వరుసగా వంతెనలు కూలిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితం అరారియా జిల్లాలోని పరారియా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఓ వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరవకముందే తాజాగా మరో వంతెన కూలిపోయింది. సివాన్‌లోని దారుండా బ్లాక్‌లోని రామ్‌గర్హాలో గల గండక్ కాలువపై నిర్మించిన వంతెన కూలిపోయినట్లు అక్కడి అధికారులు తెలిపారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అయితే, వారం వ్యవధిలోనే వరుసగా రెండు వంతెనలు కూలిపోవడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అరారియా జిల్లాలోని పరారియాలో రెండు రోజుల క్రితం నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. రూ. 12 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఈ వంతెనలో అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని ఇంకా చేపట్టలేదు. దీంతో ఈ వంతెనపై ప్రజా రవాణాకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. బక్రా నదిపై కుర్సా కంటా, స్కిటీ ప్రాంతాలను కలుపుతూ ఈ బ్రిడ్జిని నిర్మించారు. బ్రిడ్జి కూలడానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.



# బిభవ్ కుమార్‌కు మరో షాక్!

## జ్యుడీషియల్ కస్టడీ 14 రోజులు పొడిగింపు

**విశ్వంభరర, ఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మాలివాల్‌పై దాడి కేసులో విచారణ కొనసాగుతున్నది. నిందితుడు బిభవ్ కుమార్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మరో 14 రోజులు పొడిగించింది. జూలై 6వ తేదీ వరకు బిభవ్ కుమార్ జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టు ఈ కేసును విచారిస్తున్నది. బిభవ్‌కుమార్ గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ శనివారానికి ముగియడంతో పోలీసులు ఆయనను ఇవాళ మరోసారి తీస్ హజారీ కోర్టులో హాజరుపర్చారు. ఇంకా విచారించాల్సి ఉన్నందున బిభవ్‌ను మరో రెండు వారాలు తమ కస్టడీకి ఇవ్వాలని కోరారు. దాంతో కోర్టు రెండు వారాలపాటు బిభవ్ జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది. బిభవ్ తనపై దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణల నేపథ్యంలో బిభవ్‌కుమార్‌ను మే నెల 18న పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి నిందితుడిని కొన్ని రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగించిన తీస్ హజారీ కోర్టు.. ఆ తర్వాత జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దర్యాప్తు అధికారుల విజ్ఞప్తి మేరకు ఈ జ్యుడీషియల్ కస్టడీని పలు దఫాలుగా పెంచుతూ వస్తున్నది. తాజాగా మరోసారి పొడిగించింది. బెయిల్‌పై బయటికి వచ్చిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కలిసేందుకని గత నెలలో స్వాతి మాలివాల్ ఆయన నివాసానికి వెళ్లింది. అయితే అప్పాయింట్‌మెంట్ లేదన్న కారణంతో అధికారులు ఆమెకు అనుమతి నిరాకరించారు.



# నీట్ వివాదంపై ఉన్నతస్థాయి కమిటీ

- పార్లమెంట్ సమావేశాలకు ముందు రోజు ప్యానల్ ఏర్పాటు
- ఏడుగురు సభ్యులతో కమిటీ.. 2 నివేదిక ఇవ్వాలని ఆదేశం

**విశ్వంభర, ఢిల్లీ:** నీట్ పేపర్ లీక్‌పై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. విద్యార్థి సంఘాలతో పాటు ఆయా విపక్ష పార్టీలు నిరసనలు, ధర్నాలు చేపడుతున్నారు. కొద్ది రోజులుగా ఈ వివాదం రోజురోజుకు ముదురుతోంది. ఇంకోవైపు సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయసభలను ప్రతిపక్షాలు స్తంభింపజేసే అవకాశాలు ఉన్నాయన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. నీట్ పరీక్షలు సజావుగా నిర్వహించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఇస్రో మాజీ చీఫ్ కె రాధాకృష్ణన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఏడుగురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. రెండు నెలల్లోగా విద్యాశాఖకు నివేదిక అందజేయాలని కేంద్రం ఆదేశించింది. హెచ్‌సీయూ వీసీ, ప్రొఫెసర్.బీజేరావు, ఐఐటీ మద్రాస్ ప్రొ.రామమూర్తి, కర్మయోగి భారత్ కో ఫౌండర్ పంకజ్ బన్సల్, ఐఐటీ ఢిల్లీ డీన్ ప్రొ.ఆదిత్య మిత్తల్, కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్, ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డా. రణ్‌దీప్ గులేరియా సభ్యులుగా ఉన్నారు. ప్రవేశ పరీక్షల నిర్వహణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండటం కోసం ఈ కమిటీని ఏర్పాటుచేసినట్లు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. పరీక్షల నిర్వహణ విధానంలో సంస్కరణలు, డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్స్‌లో పురోగతి, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపై ఈ కమిటీ తగిన సిఫార్సులు చేయనుంది. రెండు నెలల్లోగా తన నివేదికను సమర్పిస్తుందని కేంద్రం తెలిపింది. ఇటీవల నీట్, నెట్ ప్రవేశపరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అవడం తీవ్ర వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ 2024ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా నేరంగా పరిగణిస్తారు. బాధ్యులకు 5 నుంచి 10 ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ.కోటి వరకు జరిమానా విధించే వీలుంది.



# అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ట చేసిన పూజారి మృతి

## సంతాపం ప్రకటించిన సీఎం యోగీ

**విశ్వంభర, వారణాసి:** అయోధ్య రామాలయంలో బాలరాముడికి ప్రాణ ప్రతిష్ట చేసిన ప్రధాన పూజారి ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 86 ఏళ్లు. గత కొన్ని రోజులుగా ఆయన ఆరోగ్యంగా సరిగా లేదని కుటుంబసభ్యులు వెల్లడించారు. వారణాసిలోని గాంగా నది తీరంలో ఉన్న మణికర్ణిక ఘాట్‌లో ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జనవరి 22వ తేదీన అయోధ్యలో రామ్‌లల్లాను ప్రతిష్టించిన విషయం తెలిసిందే. ఆ రోజున నిర్వహించిన పూజలకు ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ నాయకత్వం వహించారు. వారణాసిలో ఉన్న పండితుల్లో లక్ష్మీకాంత్ దీక్షిత్‌ను అగ్రగణ్యులగా భావిస్తారు. వీరి స్వస్థలం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా. కానీ వారి కుటుంబసభ్యులు ఎన్నో తరాలుగా వారణాసిలోనే నివసిస్తున్నారు. ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ మృతి పట్ల యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. తన ఎక్స్ పోస్టులో ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ కాశీకి చెందిన గొప్ప పండితుడు అని, శ్రీరామ జన్మభూమి ప్రాణ ప్రతిష్టలో ఆయన పాల్గొన్నారని, ఆయన మనల్ని వదిలివెళ్లడం.. ఆధ్యాత్మిక, సాహితీ ప్రపంచానికి తీరని లోటు అవుతుందని సీఎం యోగి పేర్కొన్నారు. సంస్కృత భాషకు, భారతీయ సంస్కృతికి ఆయన చేసిన సేవల్ని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని సీఎం యోగి తన ఎక్స్ పోస్టులో వెల్లడించారు. రాముడి పాదాల వద్ద ఆయనకు చోటు ఇవ్వాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయన భక్తులకు, ఫాలోవర్లకు శక్తిని ఇవ్వాలన్ని సీఎం వేడుకున్నారు.



# స్పీకర్‌గా అయ్యన్న బాధ్యతలు

## పలు ఛానళ్లపై ఉన్న నిబంధనలు తొలగింపు

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎన్నికయ్యారు. ఆయన ఏకగ్రీవంగా స్పీకర్‌గా ఎన్నికైనట్టు శాసన సభలో ప్రకటించారు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి. దీంతో ఏపీ 16వ అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు ఎన్నికయ్యారు. ఇక ఆ తర్వాత అయ్యన్న పాత్రుడుని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్.. స్పీకర్ స్థానంలో కూర్చుండబెట్టారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు స్పీకర్ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ముగిసిన విషయం విదితమే. ఈ తరుణంలోనే ఆయన స్పీకర్‌గా తొలి సంతకం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈటీవీకి అనుమతి నిరాకరిస్తూ నిబంధనలు విధించింది. ఈటీవీపై ఆంక్షలు తొలగించాలంటూ టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. తక్షణమైన ఆంక్షలు సడలిస్తూ స్పీకర్ తొలిసంతకం చేశారు. ఈటీవీ సహా పలు ఛానళ్లపై ఉన్న నిబంధనలను సైతం కొట్టివేశారు. అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనకు నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉంది. 1983లో టీడీపీ ఆవిర్భావంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన అయ్యన్నపాత్రుడు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీ గా గెలిచారు. ఇప్పటి వరకూ ఐదు ప్రభుత్వాల్లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మంత్రి గా సాంకేతిక విద్య, క్రీడా, రహదారులు భవనాలు, అటవీ, పంచాయతీరాజ్ వంటి కీలక శాఖల బాధ్యతలు నిర్వహించారు. 1983 నుంచి ఇప్పటి వరకూ 10 సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో, 2 సార్లు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ నర్సీపట్నం అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగి ఘన విజయం సాధించారు కూడా.

# అయ్యన్నను అధ్యక్ష స్థానంలో చూస్తున్నాం

- బీసీ నేతగా అధ్యక్ష పదవిలో చూడడం హ్యాపీ
- పార్టీని కన్నతల్లిలా 42 ఏళ్లు పార్టీ జెండా మోసారు
- గత ప్రభుత్వం ఎన్నో కేసులు పెట్టినా భయపడలే
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**విశ్వంభర, విజయవాడ :** ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఆయన చైర్‌లో కూర్చోబెట్టిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ”అధ్యక్షా.. తెలుగు రాష్ట్రాల్లోని అత్యంత సీనియర్ శాసన సభ్యుల్లో మీరు ఒకరు. బీసీ నేతగా ఉన్న మిమ్మల్ని నేడు శాసనసభ అధ్యక్ష పదవిలో చూడడం చాలా సంతోషంగా ఉంది. గతంలో మిమ్మల్ని సభలో ఎమ్మెల్యేల మధ్య చూశాం.. ఇప్పుడు అధ్యక్ష స్థానంలో చూస్తున్నాం. ఎంతో ఆనందంగానూ, గర్వంగానూ ఉంది. అందరి ఆమోదంతో, 16వ శాసనసభ స్పీకర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన మీకు నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు. అయ్యన్న పాత్రుడు పోరాట యోధుడు, రాజీ పడని నాయకుడు, విశిష్టమైన లక్షణాలు ఉండే వ్యక్తి. తెలుగు రాష్ట్రాల్లో ఏ మారుమూల ప్రాంతంలోనైనా అయ్యన్న పాత్రుడు గురించి అడిగితే చెబుతారు. ఆయన వయసు 66 సంవత్సరాలు.. ఇప్పుడు కూడా ఫైర్ బ్రాండే. ఆయన చివరి క్షణం వరకు ఫైర్ బ్రాండ్ గానే ఉంటారు. ఎక్కడా రాజీనే లేదు. మరోవైపు, తన కంటూ ఇక ఇమేజ్ సొంతం చేసుకున్నారు. విధేయత పరంగా చూస్తే... పార్టీలో కరడుగట్టిన ‘పసుపు’ యోధుడిగా ఎప్పటికీ ఉంటారు. నీతి, నిజాయతీ, నిబద్ధత పుణికిపుచ్చుకున్న వ్యక్తి... ఆ విధంగానే రాజకీయాలు చేస్తున్నారు. అసెంబ్లీలో చాలా మంది మొదటిసారి ఎమ్మెల్యేగా వచ్చిన వాళ్లు ఉన్నారు.

### 42 ఏళ్లుగా పసుపు జెండాను మోస్తూనే ఉన్నారు

కొందరు రెండోసారి ఎమ్మెల్యేలుగా వచ్చిన వాళ్లు ఉన్నారు. కానీ, అయ్యన్నపాత్రుడు 42 ఏళ్లుగా ఒక నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని, అక్కడే ఏడు పర్యాయాలు గెలవడం అనేది ఒక అరుదైన విషయం. చాలామందికి రెండు, మూడు సార్లు గెలిచేసరికి వారి మనస్తత్వం మారిపోతుంది. అయ్యన్నపాత్రుడు అందుకు భిన్నమైన వ్యక్తి. అప్పటికీ ఇప్పటికీ అదే చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. పార్టీని కన్నతల్లిలా భావిస్తూ 42 ఏళ్లుగా పసుపు జెండాను మోస్తూనే ఉన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షించే వ్యక్త అయ్యన్న. ముఖ్యంగా విశాఖ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కోసం పాటుపడ్డారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు నీళ్లు కావాలి, గోదావరి నీళ్లు రావాలి, ఆ ప్రాంతం కూడా బాగుపడాలి.. మా కరవు ప్రాంతానికి నీళ్లు కావాలని క్యాబినెట్ మంత్రిగా వెంటపడి సాధించుకున్న వ్యక్తి అయ్యన్న పాత్రుడు. అందుకు ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. కష్టాలు అందరికీ వస్తాయి. ఆయన తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఎదుర్కోనంత ఇబ్బందులు గత ఐదేళ్లుగా ఎదుర్కొన్నారు. అదీ మామూలుగా కాదు. తన ఇంట్లోకి గోడలు పగలగొట్టుకుని వందల మంది పోలీసులు వచ్చారు. అది కూడా రాత్రివేళ వచ్చి భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఒక పోలీస్ స్టేషన్‌లో కాదు.. పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టారు. రాత్రివేళ తీసుకుపోయి ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు తిప్పారు. ఆయన ఎక్కడా భయపడలేదు. ఈ సభలో ఉండేవారందరికీ ఒక విజ్ఞప్తి చేస్తున్నా. ప్రతి ఒక్క నాయకుడి జీవితంలోనూ కొన్ని స్ఫూర్తిదాయక ఘటనలు ఉంటాయి. అయ్యన్న జీవితంలో ఉండే పాజిటివ్ అంశాలను మీరు కూడా గమనించాలి” అని స్పష్టం చేశారు.



# మీరు అవతారం మార్చాలి

- ఇక నుంచి అయన్న హుందాతనం చూస్తారు
- ప్రత్యర్థులను తిట్టే అవకాశం లేదు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విశ్వంభర, విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 16వ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన అయ్యన్న పాత్రుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. తొలిసారిగా సభలో అడుగుపెట్టిన తనలాంటి వారికి అధ్యక్ష స్థానంలో కూర్చున్న అయ్యన్న పాత్రుడు రాజకీయ అనుభవం మార్గదర్శకంగా పనిచేస్తుందని చెప్పారు. ఇన్నాళ్లూ అయ్యన్న వాడి వేడి చూసిన ప్రజలు ఇకపై ఆయన హుందాతనం చూస్తారని పేర్కొన్నారు. అయితే, ప్రత్యర్థులను తిట్టే అవకాశం గౌరవ స్పీకర్ పదవి కారణంగా అయ్యన్న కోల్పోవడం కాస్త బాధగా ఉందంటూ పవన్ అన్నారు. దీంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. సభికులు కొందరు బల్లలు చరుస్తూ హర్షం వ్యక్తం చేశారు. సభలో ప్రత్యర్థులను తిట్టే అవకాశం కోల్పోయిన అయ్యన్న పాత్రుడు.. తిట్టే సభ్యులను నియంత్రించాల్సిన బాధ్యత చేపట్టడం సంతోషంగా ఉందని పవన్ చెప్పారు. స్కూలులో అల్లరి పిల్లవాడిని క్లాస్ లీడర్ గా చేసినట్లుగా ఉందని అన్నారు. అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన సభ హుందాగా నడుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, చర్చల పేరుతో అసభ్య పదజాలం వినిపించకుండా చూడాలని కోరారు. గతంలో సభలో జరిగిన తిట్ల పురాణం వల్ల ప్రజలు విసిగిపోయి, వారిని కేవలం పదకొండు సీట్లకే పరిమితం చేశారని పరోక్షంగా వైసీపీ ఓటమిని పవన్ గుర్తుచేశారు. విజయాన్ని ఆహ్వానించడం మాత్రమే వారికి తెలుసని, ఓటమిని ఒప్పుకోలేక సభ నుంచి పారిపోయారని విమర్శించారు. భాష నియంత్రణ సభ నుంచే మొదలుకావాలని, గౌరవ స్పీకర్ ఆ బాధ్యత తీసుకోవాలని పవన్ కల్యాణ్ కోరారు. సభలో చిన్నా పెద్ద నాయకుడనే తేడా లేకుండా వ్యక్తిగత దూషణ గత సభలలో చూసి ప్రజలతో పాటు తనకూ బాధేసిందని చెప్పారు. భావంలో ఉండే తీవ్రత భాషలో ఉండాల్సిన పనిలేదని అన్నారు. భాష మనుషులను కలిపేందుకే కానీ విడగొట్టడానికి కాదని, విద్వేషాలు రేపడానికి అంతకంటే కాదని పవన్ అన్నారు. విద్వేషాలను పరిష్కరించడానికి ఉపయోగపడాలని, ఈ సభ ఉన్నదే అందుకని గుర్తుచేశారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు ఈ సభ భవిష్యత్ కు ప్రమాణంగా మారాలని పవన్ కోరారు. సభలో ఇప్పుడున్న వారంతా శాసనాలు రూపొందించడానికే తప్ప ఉల్లంఘించడానికి కాదన్నారు. విభేదించడం, వాదించడం ఇవన్నీ ప్రజాస్వామ్యానికి పునాదులు అని చెప్పారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు మన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతోనే మొదలైందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు బలిదానంతో మన రాష్ట్రం పుట్టిందన్నారు. 56 రోజుల పాటు తిండినీరు మానేసి ఆయన నరకం అనుభవించారు. ఆయన త్యాగాన్ని గుర్తుంచుకుంటూ సభను ప్రతీ నిమిషం రాష్ట్ర పురోభివృద్ధికి ఉపయోగపడేలా సభా సమయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ‘అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతిలో విలువలతో కూడిన సత్సంప్రదాయాలకు తెరలేపుతూ మీ ఆధ్వర్యంలో ఈ సభను నడుపుతూ, ఈ విలువైన ఐదేళ్లు రాబోయే తరాలకు గొప్ప భవిష్యత్తును ఇచ్చేలా, రైతులకు అండగా, మహిళలకు భద్రత కల్పించేలా, ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత ఇచ్చేలా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేసేలా చర్చలు జరగాలని కోరుకుంటున్నా. సభాపతి అయ్యన్న పాత్రుడు గారికి మరోమారు శుభాభినందనలు తెలియజేస్తున్నా’ అంటూ పవన్ తన ప్రసంగాన్ని ముగించారు.

# రేపు తొలి కేబినెట్ భేటీ

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశం
- 8 శాఖలపై శ్వేతపత్రం విడుదల అంశాలపై చర్చ!

**విశ్వంభర, అమరావతి:** ఏపీలో కొత్త ప్రభుత్వం పాలన ప్రారంభించిన నేపథ్యంలో, క్యాబినెట్ తొలిసారిగా సమావేశం కానుంది. ఈ నెల 24న సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యతలపై సీఎం చంద్రబాబు మంత్రివర్గ సహచరులకు దిశానిర్దేశం చేయనున్నారు. హామీల అమలు, రాజధాని, పోలవరం నిర్మాణాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. మొత్తం 8 శాఖలపై శ్వేతపత్రాల విడుదలకు ఈ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం.



# కక్ష సాధింపుతోనే కూల్చివేత

**• న్యాయం పూర్తిగా కనుమరుగైపోయింది • పార్టీ కార్యాలయం కూల్చివేతపై జగన్ ట్వీట్**



**విశ్వంభర, గుంటూరు:** వైఎస్ జగన్‌కు ఏపీ ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. గుంటూరు జిల్లా తాడేపల్లి నిర్మిస్తున్న వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని సీఆర్‌డీఏ అధికారులు కూల్చివేశారు. సీతానగరం బోటు యార్డ్ కాంపౌండ్‌లో 870.40 చదరపు మీటర్ల స్థలంలో అక్రమంగా కేంద్ర కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ సీఆర్‌డీఏ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏడు పొక్లెయినర్లతో దాదాపు రెండు గంటల పాటు శ్రమించి.. వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన ఈ చర్యపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్రంగా స్పందించారు. ఏపీలో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగిన చంద్రబాబు తన దమనకాండను మరోస్థాయికి తీసుకెళ్లారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఒక నియంతలా తాడేపల్లిలో దాదాపు పూర్తికావచ్చిన వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేశారని అన్నారు. హైకోర్టు ఆదేశాలను భేఖాతరు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగైపోయాయని విమర్శించారు. ఎన్నికల తర్వాత చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలతో రక్తాన్ని పారిస్తున్న చంద్రబాబు, ఈ ఘటన ద్వారా ఈ ఐదేళ్లపాటు పాలన ఏవిధంగా ఉండబోతుందనే హింసాత్మక సందేశాన్ని ఇవ్వకనే ఇచ్చారని అన్నారు. ఈ బెదిరింపులకు, ఈ కక్షసాధింపు చర్యలకు వైసీపీ తలొగ్గేదే లేదని, వెన్నుచూపేది అంతకన్నా లేదని పేర్కొన్నారు. ప్రజల తరఫున, ప్రజల కోసం, ప్రజల తోడుగా గట్టి పోరాటాలు చేస్తామని చెప్పారు. దేశంలోని ప్రజాస్వామ్యవాదులంతా చంద్రబాబు దుశ్చర్యల్ని ఖండించాలని మాజీ సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు.



# రాష్ట్రంలో బుల్‌డోజర్ల ప్రభుత్వం

- అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం కాదు
- వైసీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం దారుణం
- మాజీ మంత్రి అమర్నాథ్


**విశ్వంభర, విశాఖపట్నం:** ఏపీలో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధ్వంసంపై మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు అమర్నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. రెడ్ బుక్ రాసుకున్నవి అమలు చేస్తామని టీడీపీ భావిస్తే అధికారం ఎవరికి శాశ్వతం కాదని, అవకాశాలు అందరికి వస్తాయని గుర్తించాలని సూచించారు. ప్రతిదానికి ప్రజలు సమాదానం చెబుతారని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి కూటమి ప్రభుత్వం విధ్వంసాలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బుల్‌డోజర్ల ప్రభుత్వం వచ్చిందని మండిపడ్డారు. విశాఖలో కార్పొరేటర్ ఇంటిపై రాళ్లతో దాడిచేసి అద్దాలు పగులగొట్టారని ఆరోపించారు. కేసు కోర్టులో ఉండగా తాడేపల్లిలో వైసీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం దారుణమని మాజీ మంత్రి అమర్నాథ్ పేర్కొన్నారు.

# అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

- చంద్రన్న ప్రజాస్వామ్యవాదా..? విధ్వంసకారుడా..?
- మాజీ మంత్రి అంబటి రాంబాబు



**విశ్వంభర, తాడేపల్లి :** తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయ భవనాలను కూల్చివేయడం కక్షపూరిత చర్య అని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. చట్టబద్ధంగా ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న కార్యాలయం కూల్చివేయడం ధర్మమేనా అంటూ ముఖ్య మంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న వైసీపీ పార్టీ కార్యాలయాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. గుర్తుపెట్టుకోండి.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదంటూ మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం భవనాన్ని అధికారులు కూల్చివేశారు. ఆ స్థలాన్ని సందర్శించిన అంబటి రాంబాబు.. అనంతరం మీడియాతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న కట్టడాన్ని రెండు గంటల్లో నేలమట్టం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. క్యాబినెట్లో నిర్ణయం తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాలకు స్థలాలను కేటాయించారు. టీడీపీ హయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయించి కేటాయింపులు చేసుకుని పార్టీ కార్యాలయాలు కట్టుకున్నారు. కక్ష సాధింపుతోనే తాడేపల్లిలో వైసీపీ పార్టీ కార్యాలయ భవనాన్ని కూల్చేశారని అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. గుర్తు ఉంచుకోవాలి. ప్రభుత్వ స్థలాన్ని 33 సంవత్సరాలు లీజుకు తీసుకున్నాం. సీఆర్‌డీఏ నోటీసు ఇచ్చారు. 15 రోజులు సమయం ఉంటుంది. హై కోర్టుకి వెళ్లాం. ప్రోసెస్ ప్రకారమే చర్యలు తీసుకుంటాం అని నిన్నకోర్టులో చెప్పారు. ఇంతలోనే కూల్చేశారంటూ అంబటి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావేదిక ప్రభుత్వానిది. ఇది మా పార్టీ కార్యాలయం. మా పార్టీ కార్యాలయం కట్టుకుంటే మీకు కడుపు మంట ఎందుకని అంబటి ప్రశ్నించారు. సూపర్ 6 అమలు ఇంకా మొదలు కాకుండానే విధ్వంసాలకు పాల్పడుతున్నారు. ఇది ముమ్మాటికీ దుర్మార్గం. ఇతర ప్రాంతాల్లో మా నిర్మాణాలు అన్ని కూల్చెయ్యాలి అనుకుంటే మీ ఇష్టం.. అధికారం మీ చేతుల్లో ఉంది. మీరు కక్ష సాధింపు చేసినా.. ఏమీ చేసినా చట్ట ప్రకారం ముందుకెళ్తాం. వైసీపీ కార్యాలయం కూల్చివేతపై మళ్లీ కోర్టుకు వెళ్తున్నామని అంబటి రాంబాబు చెప్పారు. అదే విధంగా ట్విట్టర్ వేదికగా.. సూపర్ 6 అమలు కన్నా వైసీపీ ఆఫీసు కూల్చడమే ముఖ్యమని భావించిన చంద్రన్న ప్రజాస్వామ్యవాదా..? విధ్వంసకారుడా..?” అంటూ ట్వీట్ చేశారు. ఇది ప్రజాస్వామ్యం కాదని, విధ్వంసమేనని ఆయన విమర్శించారు. దీనికి తాడేపల్లిలో నిర్మాణాన్ని బుల్డోజర్లు కూల్చివేస్తున్న వీడియోను జత చేశారు.



# మాజీ సీఎం జగన్‌కు తప్పిన ప్రమాదం!

**విశ్వంభర, కడప:** ఏపీ మాజీ సీఎం జగన్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. కడప విమానాశ్రయం నుంచి పులివెందులకు వెళ్తుండగా రామరాజు పల్లి వద్ద కాన్వాయ్ వాహనాలు ఢీకొన్నాయి. జగన్ కాన్వాయ్‌లోని ఇన్నోవా వాహనాన్ని ఫైర్ ఇంజన్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఇవాళ(శనివారం) జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో పర్యటిస్తున్నారు. మూడు రోజులు అక్కడే బస చేయనున్నారు. రాయలసీమ కు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు, ముఖ్య నేతలు, కార్యకర్తలతో జగన్ భేటీ అవుతారు. మరోవైపు ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యేలు 11మంది మాత్రమే గెలుపొందిన విషయం తెలిసిందే. శుక్రవారం తొలిరోజు అసెంబ్లీకి హాజరైన జగన్ బరువైన గుండెతో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, రెండో రోజు (ఇవాళ) నిర్వహించిన సమావేశానికి జగన్ హాజరు కాలేదు.





# భారత్ జయహో..

- బంగ్లాదేశ్‌పై భారీ విజయం
- 50 పరుగుల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో హర్దిక్.. బౌలింగ్‌లో కుల్దీప్ ధూంధాం
- సెమీస్ బెర్తు ఖాయం చేసుకున్న భారత్

విశ్వంభర, స్పోర్ట్స్: టీ20 ప్రపంచకప్ 2024లో భారత్ జోరు కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌తో శనివారం ఏకపక్షంగా సాగిన సూపర్-8 మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన టీమిండియా 50 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ షోకు కుల్దీప్ యాదవ్(3/19) సంచలన బౌలింగ్ తోడవ్వడంతో సునాయసంగా గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా(27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 నాటౌట్) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. శివమ్ దూబే(24 బంతుల్లో 3 సిక్సర్లతో 34), విరాట్ కోహ్లీ(28 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 37), రిషభ్ పంత్(24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36) మెరుపులు మెరిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తంజిమ్ హసన్ షకీబ్(2/32), రిషద్ హొస్సేన్(2/43) రెండేసి వికెట్లు తీయగా.. షకీబ్ అల్ హసన్ ఓ వికెట్ తీసాడు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులే చేసి ఓటమిపాలైంది. నజ్ముల్ హొస్సేన్ షాంటో(32 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 40), టన్జిద్ హసన్(31 బంతుల్లో 4 ఫోర్లతో 29), రిషద్ హొస్సేన్(10 బంతుల్లో ఫోర్, 3 సిక్సర్లతో 24 ) రాణించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్(3/19) మూడేసి వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, బుమ్రా రెండేసి వికెట్లు పడగొట్టారు. హార్దిక్ పాండ్యాకు ఓ వికెట్ దక్కింది. ఈ విజయంతో టీమిండియా సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. 197 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్‌కు శుభారంభం దక్కలేదు. దూకుడుగా ఆడిన లిటన్ దాస్(13)ను హార్దిక్ పాండ్యాతో కలిసి రోహిత్ శర్మ పెవిలియన్ చేర్చాడు. సూపర్ ప్లాన్‌తో దూకుడుగా ఆడుతున్న లిటన్ దాస్‌కు చెక్ పెట్టారు. క్రీజులోకి వచ్చిన నజ్ముల్ హెస్సెన్, తన్జిద్ హసన్ ఆచితూచి ఆడారు.వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని కుల్దీప్ యాదవ్ విడదీసాడు. తన్జిద్ హసన్‌ను వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు.

## దెబ్బతీసిన కుల్దీప్ యాదవ్

ఆ వెంటనే టౌహిడ్ హృదయ్(4)ను ఔట్ చేసిన కుల్దీప్ యాదవ్.. మరుసటి ఓవర్‌లో షకీబ్ అల్ హసన్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నజ్ముల్ హొస్సేన్‌ను బుమ్రా క్యాచ్ ఔట్ చేశాడు. క్రీజులోకి వచ్చిన జేకర్ అలీ,(1) రిషద్ హసన్ కూడా దారుణంగా విఫలమయ్యారు. రిషద్ హొస్సేన్(24)ను బుమ్రా ఔట్ చేయడంతో భారత విజయం లాంఛనమైంది.



# అతను టీమిండియాకు దేవుడు ఇచ్చిన గిఫ్ట్

### మాజీ ప్లేయర్ అంబటి రాయుడు

విశ్వంభర, స్పోర్ట్స్: టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్‌లపై మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల జల్లు కురిపించాడు. బుమ్రా టీమిండియాకు దేవుడిచ్చిన వరమని చెప్పిన రాయుడు.. సూర్యకుమార్ యాదవ్ తన బ్యాటింగ్‌తో క్రికెటర్లందరికి పాఠాలు చెబుతున్నాడని కొనియాడాడు. అమెరికా జట్టుపై వికెట్లు తీయనప్పటికీ పొదుపుగా బౌలింగ్ చేశాడు. అఫ్గానిస్థాన్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో బుమ్రా నిప్పులు చెరిగాడు. 3 వికెట్లు పడొట్టి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటి వరకు 4 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా మొత్తం 8 వికెట్లు తీసాడు. టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. వరుసగా 4 మ్యాచ్‌ల్లో విజయా సాధించింది. ఈ నాలుగు మ్యాచ్‌ల్లో బుమ్రా కీలక పాత్ర పోషించాడు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసిన బుమ్రా.. దాయాదీ పాకిస్థాన్‌తో జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్‌లో 3 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్సు అందుకున్నాడు. 'బుమ్రా ఎప్పటిలాగే అద్భుతంగా రాణిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే సత్తా అతనికి ఉంది. బుమ్రా వరల్డ్ క్లాస్ పేసర్. భారత జట్టుకు దేవుడు ఇచ్చిన బహుమతి. భారత జట్టులో బుమ్రా ఉండటం భారతీయుల అదృష్టం. సూర్యకుమార్ యాదవ్ కూడా అద్భుతంగా ఆడారు. బ్యాటర్లందరికీ తన బ్యాటింగ్‌తో పాఠాలు చెబుతున్నాడు. ముఖ్యంగా స్లో వికెట్‌పై ఎలా ఆడాలో చూపిస్తున్నాడు. అతను ఫుట్‌వర్క్‌ను బాగా ఉపయోగించుకుంటున్నాడు. వరల్డ్ క్లాస్ స్పిన్నర్లను క్రీజుకు రెండు మీటర్ల దూరం ఉండి ఆడుతున్నాడు.'అని అంబటి రాయుడు చెప్పుకొచ్చాడు.'బుమ్రా ఎప్పటిలాగే అద్భుతంగా రాణిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే సత్తా అతనికి ఉంది. బుమ్రా వరల్డ్ క్లాస్ పేసర్. భారత జట్టుకు దేవుడు ఇచ్చిన బహుమతి. భారత జట్టులో బుమ్రా ఉండటం భారతీయుల అదృష్టం. సూర్యకుమార్ యాదవ్ కూడా అద్భుతంగా ఆడారు. బ్యాటర్లందరికీ తన బ్యాటింగ్‌తో పాఠాలు చెబుతున్నాడు. ముఖ్యంగా స్లో వికెట్‌పై ఎలా ఆడాలో చూపిస్తున్నాడు. అతను ఫుట్‌వర్క్‌ను బాగా ఉపయోగించుకుంటున్నాడు. వరల్డ్ క్లాస్ స్పిన్నర్లను క్రీజుకు రెండు మీటర్ల దూరం ఉండి ఆడుతున్నాడు.'అని అంబటి రాయుడు చెప్పుకొచ్చాడు.



# వెస్టిండీస్‌కు ఎదురు దెబ్బ

### గాయంలో ఓపెనర్ బ్రాండన్ కింగ్ దూరం

విశ్వంభర, స్పోర్ట్స్: టీ20 వరల్డ్ కప్‌లో సూపర్ 8 పోటీలకు ఆతిథ్యమిస్తున్న వెస్టిండీస్‌కు భారీ షాక్. కీలకమైన దక్షిణాఫ్రికా మ్యాచ్‌తో పాటు టోర్నీ మొత్తానికి ఓపెనర్ బ్రాండన్ కింగ్ దూరమయ్యాడు. కండరాల గాయంతో బాధపడుతున్న కింగ్ వరల్డ్ కప్ నుంచి వైదొలిగాడు. దాంతో, అతడి స్థానంలో విధ్వంసక ఆల్‌రౌండర్ కైల్ మేయర్స్ జట్టులోకి వచ్చాడు. ఈ విషయాన్ని విండీస్ బోర్డు వెల్లడించింది. తొలి సూపర్ 8 మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై కింగ్ గాయపడ్డాడు. 23 పరుగుల వద్ద ఉండగా పక్కటెముకల సమీపంలోని కండరాల నొప్పితో కింద పడిపోయాడు. ఫిజియో వచ్చి పరీక్షించినా అతడు నొప్పికి తట్టుకోలేకపోయాడు. దాంతో, ఇన్నింగ్స్ మధ్యలోనే అతడు రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. అమెరికా మ్యాచ్ వరకూ అతడు కోలుకుంటాడని మేనేజ్‌మెంట్ భావించింది. కానీ, కింగ్ ఆరోగ్యం ఇంకా మెరుగవ్వలేదు. అందుకని దక్షిణాఫ్రికాతో జూన్ 23ఆదివారం మ్యాచ్‌కు ముందు విండీస్ బోర్డు మేయర్స్‌ను ఎంపిక చేసింది.

# పారిస్ ఒలింపిక్స్‌కు భారత టెన్నిస్ స్టార్ క్వాలిఫై!



విశ్వంభర, స్పోర్ట్స్: భారత టెన్నిస్ స్టార్ ప్లేయర్ సుమిత్ నగాల్ పారిస్ ఒలింపిక్స్ బెర్త్ సాధించాడు. మెన్స్ సింగిల్స్ ఈవెంట్‌లో అతను పోటీపడనున్నాడు. ఈ విషయాన్ని సుమిత్ శనివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. 'పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించానని చెప్పడానికి సంతోషిస్తున్నా. ఒలింపిక్స్ నాకు చాలా స్పెషల్. టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనడం నా కెరీర్ ప్రత్యేకమైనది. అప్పటి నుంచి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నా. నా ఉత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ఎదురుచూస్తున్నా.'అని తెలిపాడు. టోక్యో ఒలింపిక్స్-2020లో పాల్గొన్న సుమిత్ రెండో రౌండ్‌లో పరాజయం పాలయ్యాడు. భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్(1992, 2000) తర్వాత వరుసగా సమ్మర్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న రెండో భారత ఆటగాడిగా సుమిత్ నిలిచాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో సుమిత్ 71వ ర్యాంక్‌లో ఉన్నాడు. టాప్-56 మంది ప్లేయర్లు నేరుగా ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. అయితే, ఒక దేశం నుంచి గరిష్టంగా నాలుగురు మాత్రమే పాల్గొనడానికి వీలు ఉండటంతో సుమిత్‌కు కలిసొచ్చింది. పురుషుల డబుల్స్‌లో భారత సీనియర్ ప్లేయర్ రోహన్ బోపన్న.. శ్రీరామ్ బాలాజీతో కలిసి విశ్వక్రీడల్లో పాల్గొననున్నాడు. వచ్చే నెల 4న ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ అధికారికంగా ఎంట్రీ లిస్ట్‌ను రిలీజ్ చేయనుంది.

### ఆ ఒక్క కారణంతోనే


# కుప్పకూలిన బంగారం ధర..



విశ్వంభర, బిజినెస్ : అమెరికా ఫెడరల్ రిజర్వ్ మళ్లీ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాల నడుమ కొద్ది రోజులుగా మళ్లీ బంగారం ధరలు పెరుగుతున్న సంగతి తెలిసిందే. కిందటి రోజు సడెన్‌గా తులం బంగారం ధర రూ. 800కుపైగా పెరగడం ఆందోళన కలిగించింది. మళ్లీ రికార్డు స్థాయి గరిష్ఠాలకు దగ్గరగా వెళ్లింది. ఇదే సమయంలో ఇప్పుడు మాత్రం సడెన్‌గా గోల్డ్ రేటు కుప్పకూలిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో చూసినట్లయితే స్పాట్ గోల్డ్, సిల్వర్ రేట్లు భారీగా దిగొచ్చాయి. కిందటి రోజు స్పాట్ బంగారం ధర ఔన్సుకు 2370 డాలర్ల వద్ద ఉండగా.. దాదాపు 50 డాలర్ల వరకు తగ్గి 2320 డాలర్ల లెవెల్స్‌కు పడిపోయింది. ఇక స్పాట్ సిల్వర్ రేటు కూడా 30 డాలర్లపైన ఉండగా.. ఇప్పుడు 29.69 డాలర్ల స్థాయికి దిగొచ్చింది. ముఖ్యంగా డాలర్ పుంజుకోవడంతో రూపాయి కూడా పతనమైంది. ప్రస్తుతం ఇది రూ. 83.618 వద్ద ఉంది. ఇలా బంగారం ధర పడిపోయేందుకు ప్రధాన కారణం యూఎస్ డాలర్. అవును సాధారణంగానే డాలర్, బంగారానికి అనులోమానుపాత సంబంధం ఉంటుంది. డాలర్ పెరిగితే బంగారం ధర పడిపోతుంటుంది. అదే డాలర్ డిమాండ్ తగ్గితే అప్పుడు బంగారానికి విలువ పెరుగుతుంది. ఇది ఎప్పుడూ జరిగేదే.ఇప్పుడు బలమైన యూఎస్ బిజినెస్ యాక్టివిటీ కారణంగా డాలర్, యూఎస్ బాండ్ ఈల్డ్స్‌కు ఒక్కసారిగా గిరాకీ ఊహించని రీతిలో పెరిగింది. ఇదే బంగారం వాల్యూ తగ్గేందుకు కారణమైంది. స్పాట్ గోల్డ్ 1.6 శాతం వరకు తగ్గగా.. గోల్డ్ ఫ్యూచర్స్ 1.5 శాతం పడిపోయి 2333.80 డాలర్ల వద్ద ఉంది.

# ట్రైన్ టికెట్లు బుక్ చేసుకుంటున్నారా?

### 45 పైసలకే రూ.10లక్షల బెనిఫిట్..



విశ్వంభర, బిజినెస్ : పశ్చిమ బంగాల్‌లోని జల్పాయ్‌గుడీ దగ్గర ఇటీవల ఘోర రైలు ప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. గూడ్స్ రైలు కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టగా పదులకొద్దీ చనిపోయారు. చాలా మంది గాయాల పాలయ్యారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్‌లో, ఒడిశా బాలేశ్వర్‌లో కూడా ఘోర ప్రమాదాలు జరిగాయి. ఇలాంటప్పుడే ఇన్సూరెన్స్ ఆవశ్యకత తెలుస్తుంది. ముఖ్యంగా ఇలాంటి సమయాల్లో ట్రావెల్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. మీకు వ్యక్తిగతంగా ట్రావెల్ ఇన్సూరెన్స్ లేకపోయినా పర్లేదు. ఐఆర్‌సీటీసీ నుంచి కొనుగోలు చేసే ట్రైన్ ఇ-టికెట్లలో ఆప్షనల్ ఇన్సూరెన్స్ పాలసీ అందుబాటులో ఉంది. రైలు ప్రమాదంలో చనిపోవడమో, వైకల్యం బారిన పడటమో, ఆస్పత్రిలో చేరడమో ఇలాంటి సందర్భాల్లో గరిష్టంగా రూ. 10లక్షలు ఇన్సూరెన్స్ వస్తుంది. లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్, రాయల్ సుందరం జనరల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ భాగస్వామ్యంతో ఐఆర్‌సీటీసీ ఈ ట్రావెల్ ఇన్సూరెన్స్ అందిస్తోంది. ఐఆర్‌సీటీసీ నుంచి రోజుకు దాదాపు 15 లక్షల మందికిపైగా ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకుంటూ ఉంటారు. దీంట్లో ప్రతి ఒక్కరూ బీమా ప్రయోజనాలకు అర్హులే. అంతకు ముందు టికెట్లు బుక్ చేసుకునే సమయంలో ట్రావెల్ ఇన్సూరెన్స్ ఆప్షన్ సెలక్ట్ చేసుకోవాల్సి ఉండేది. అలా చేసుకుంటే 45 పైసలు (టాక్సులతో కలిపి) కట్ అయ్యేవి. అయితే తొందరలో చాలా మంది ప్రమాద బీమా ఎంపిక చేసుకోవడం మర్చిపోతుంటారు. ఇలాంటి వారు బీమా ప్రయోజనాలను కోల్పోకుండా ఉండేందుకు ఈ సదుపాయాన్ని డిఫాల్ట్ చేసింది ఐఆర్‌సీటీసీ.

### ఐఆర్‌సీటీసీ ట్రావెల్ ఇన్సూరెన్స్..

టికెట్ బుక్ చేసుకునేటప్పుడు ఈ టిక్ బాక్స్ టిక్ చేయాల్సిన అవసరం లేకుండా డిఫాల్ట్‌గా ఇస్తోంది. వద్దనుకున్న వారు మాత్రం దానిని తీసేయొచ్చు. ఈ ఇన్సూరెన్స్ కింద ప్రమాదంలో మరణించడం లేదా శాశ్వత అంగవైకల్యం ఏర్పడి మరేం పని చేయలేని పరిస్థితి వస్తే బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షలు ఇస్తారు. ఇక తీవ్రంగా గాయపడి అంగ వైకల్యం వస్తే రూ. 7.5 లక్షలు బీమా అందుతుంది. ఇక గాయపడ్డవారికి ఆస్పత్రి ఖర్చుల కింద రూ. 2 లక్షల వరకు అందుతుంది. ఒకవేళ మృతదేహం తరలించాల్సి వస్తే దానికి రూ. 10 వేలు ఇస్తుంది.



# ఆడాళ్లను ఎందుకు క్యారెక్టర్ లేని వాళ్లలా చూస్తారు..?

విశ్వంభర, సినిమా: షార్ట్ ఫిల్మ్స్ నుంచి సినిమాల్లోకి వచ్చిన వారు చాలా మంది ఉన్నారు. అలా వచ్చిన వారిలో చాందిని చౌదరి ఒకరు. హీరోయిన్ గా ఆచి తూచి సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. హీరోయిన్ గా చేయకముందు పలు సినిమాల్లో చిన్న చిన్న రోల్స్ చేసింది. లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్, ప్రేమ ఇష్క్ కాదల్, కేటుగాడు, బ్రహ్మోత్సవం సినిమాల్లో చిన్న రోల్స్ చేసింది. ఆ తర్వాత కుందనపుబొమ్మ సినిమాతో హీరోయిన్ గా మారింది. అలాగే కలర్ ఫోటో సినిమాతో పేక్షకులను మెప్పించింది. కలర్ ఫోటో సినిమాలో చాందిని చౌదరి తన నటనతో ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత చాందిని వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నాయి. రీసెంట్ గా విష్వక్ సేన్ గామీ తో పాటుగా లేటెస్ట్ గా వచ్చిన యేవమ్, మ్యూజిక్ షాప్ మూర్తి చిత్రాలతో ఆకట్టుకుంద. ఇదిలా ఉంటే తాజాగా చాందిని ఓ ఆసక్తికర కామెంట్స్ చేసింది. సోషల్ మీడియా వేదికగా ఆమె పోస్ట్ ను షేర్ చేసింది. ఇప్పుడు ఈ పోస్ట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. సినీఇండస్ట్రీలో పనిచేసే ఆడవాళ్లను.. మగాళ్లు ఎందుకు క్యారెక్టర్ లేని వారిలా చూస్తారు? అంటూ ప్రశ్నించింది చాందిని చౌదరి. ఈ పోస్ట్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.

"నేను ఇండస్ట్రీలో చూసిన దాని ప్రకారం.నిజాయితీగా ఓ ప్రశ్న మీ అందరిని అడుగుతున్నాను. ఫిల్మ్ ఇండస్ట్రీలో పనిచేసే ఆడవారిని మగాళ్లు ఎందుకు క్యారెక్టర్ లేని వాళ్లలా చూస్తారు? వాళ్లు మాట్లాడే ప్రతీమాటలో ఆడవాళ్లను తక్కువ చేసే మాట్లాడతారు. అది ఎంతో బాధ కలిగిస్తోంది. ఎందుకంటే.? ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పని చేయాలి. అలాంటప్పుడు ఇలాంటివి చూస్తే మనసు విరిగిపోతుంది" అంటూ ట్విట్టర్ లో రాసుకొచ్చింది చాందిని. ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో.. అలాగే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.

# ప్రియుడికి ఖరీదైన బహుమతి ఇస్తున్న శోభాశెట్టి!





బిగ్ బాస్ సీజన్ 7 లో మంచి గుర్తింపు తెచ్చుకున్న శోభా శెట్టి. బిగ్ బాస్ లో ఆమె చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ప్రశాంత్, శివాజీ టీమ్ తో సై అంటే సై అన్న శోభాశెట్టి. శోభాశెట్టి ఇంతకు ముందు ప్రజలకు ఇష్టమైన కార్తీక దీపం సీరియల్ లో మోనిత అనే విలన్ పాత్రతో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది శోభాశెట్టి. తద్వార బిగ్ బాస్ లోకి అడుగు పెట్టింది. బిజీబిజీగా ఉన్న శోభశెట్టి తన ఒంటరి జీవితానికి బై చెప్పి పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. అతను ఎవరో కాదు తన ప్రియుడు యశ్వంత్ వీరి ఇద్దరికి ఎంగేజ్మెంట్ అయినట్టు సమాచారం. శోభాశెట్టి తనకు కాబోయే భర్తకు కాస్ట్లీ కారును పుట్టిన రోజుకు గిఫ్ట్ గా ఇచ్చింది. బీస్ట్ ఎక్స్‌యూవీ 700 కారు కొన్న శోభాశెట్టి ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 15 లక్షల నుంచి 20 లక్షల మధ్యలో ఉన్న కారుని తన ప్రియుడుకి గిఫ్ట్ గా ఇచ్చింది శోభాశెట్టి. దీంతో ఇది కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శోభాశెట్టి పెళ్లికి ముందే తన ప్రియుడి కోసం ఇంత ఖర్చు పెడుతోంది ఏంటని అంతా షాక్ అవుతున్నారు.

# ఇండియాలోనే అతి పెద్ద డిజాస్టర్ మూవీ ఇదే

విశ్వంభర, సినిమా : ఇండియా లోనే ఓ సినిమా బిగెస్ట్ డిజాస్టర్ గా నిలిచింది. 40 లక్షలకు పైగా ఖర్చు చేసి సినిమా తీస్తే కనీసం లక్ష రూపాయిలు వసూల్ చేయలేదు. దాంతో నిర్మాత నిండా మునిగిపోయాడు. ఇంతకు ఆ సినిమా ఏదో తెలుసా.? ఆ కళాఖండం పేరు 'ది లేడి కిల్లర్' బాలీవుడ్ లో తెరకెక్కింది ఈ సినిమా అర్జున్ కాపుర్ హీరోగా నటించిన ఈ సినిమా భారీ డిజాస్టర్ గా నిలిచింది. గత ఏడాది రిలీజ్ అయిన ఈ సినిమాకు అజయ్ బేహల్ దర్శకత్వం వచ్చారు. ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర అత్యంత డిజాస్టర్ సినిమాగా ఈ సినిమా



నిలిచింది. అర్జున్ కపూర్, భూమి ఫడ్నే కర్ కలిసి నటించిన ఈ సినిమా సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కించారు. ఈ సినిమా కోసం మొత్తంగా 45 లక్షలు ఖర్చు చేశారు. అలాగే ప్రమోషన్స్ అన్ని కలుపుకొని ఓ రెండు కోట్లవరకు ఖర్చయింది. కానీ బకాఫీస్ వద్ద మినిమమ్ వసూల్ చేయలేకపోయింది ఈ సినిమా. ఓవరాల్‌గా ఈ సినిమా లక్ష రూపాయలు కూడా కలెక్ట్ చేయలేక అతి పెద్ద డిజాస్టర్‌గా నిలిచింది.. నిజానికి ఈ సినిమా షూటింగ్ పూర్తికాకుండానే థియేటర్స్ లో సినిమాను రిలీజ్ చేశారు. అలాగే బడ్జెట్ పెరిగిపోవడంతో చివర్లో నిర్మాతలు చేతులెత్తేశారు. సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే సినిమాను ఎడిట్ చేసి థియేటర్స్ లో కొన్ని సీన్స్ ను యాడ్ చేద్దాం అనుకున్నారు.. కానీ సినిమా దారుణంగా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమా కేవలం రూ.70 వేల కలెక్షన్లు మాత్రం తెచ్చుకుంది. దాంతో నిర్మాతలు భారీగానే నష్టపోయారు.

## దళపతి విజయ్ బర్త్‌డే ట్రీట్..

# 'ది గోట్'.. నో డైలాగ్స్.. ఓన్లీ యాక్షన్!



**విశ్వంభర, సినిమా:** కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌ను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయాల్సిన పని లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆయన మంచి క్రేజ్‌ను సంపాదించుకున్నాడు. అందుకనే ఆయన నటించిన సినిమాలు తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల అవుతూ ఉంటాయి. తాజాగా విజయ్ నటిస్తున్న సినిమా 'ది గోట్'. వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మీనాక్షీ చౌదరి కథానాయిక. జూన్ 22 దళపతి విజయ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ చిత్ర గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియో 50 సెకన్లు ఉంది. ఈ మూవీలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఇద్దరు విజయ్‌లు బైక్‌పై వెలుతుంటే విలన్స్ ఛేజింగ్ చేసే సీన్ అద్భుతంగా ఉంది. యువన్ శంకర్ రాజా అందించిన బ్యాగ్రౌండ్ స్కోరు చాలా బాగుంది. డైలాగ్స్ లేకుండా యాక్షన్ సన్నివేశాలనే హైలెట్ చేస్తూ సాగిన ఈ గ్లింప్స్ వైరల్‌గా మారింది. విజయ్ అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. హాలీవుడ్ రేంజ్‌లో దర్శకుడి టేకింగ్ ఉందంటూ మురిసిపోతున్నారు. ది గోట్ మూవీని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ నిర్మిస్తోంది. స్నేహ, లైలా, ప్రశాంత్, ప్రభుదేవా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ మూవీ సెప్టెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది

# నా భర్త విడిచిపెడితే నేనెలా దురదృష్ట వంతురాలిని అవుతా


## రేణూ దేశాయ్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఏపీ ఎన్నికల్లో విజయం సాధించారు అన్న విషయం అందరికి తెలిసిందే. ఎక్కడ చూసినా ఆయన గెలుపు గురించి మాట్లడుకుంటున్నారు. కానీ కొందరు నెటిజన్లు తన పర్సనల్ లైఫ్ గురించి చర్చిస్తున్నారు. పవన్ కల్యాణ్ మాజీ భార్య రేణు దేశాయ్ విడాకులు తీసుకున్న తర్వాత పవన్, రేణు ఎవరి దారి వారు చూసుకున్నా సరే ఫ్యాన్స్ మాత్రం రేణు పై సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతూ బాధపెడుతున్నారు అని రేణు వారిపై రియాక్ట్ అయ్యారు. రేణు దేశాయ్ పోస్ట్ కు ఒక ఫ్యాన్ ఈ విధంగా కామెంట్ చేశారు. మీరు చాలా దురదృష్టవంతురాలు మేడమ్. మీకు చాలా అందమైన కొడుకు, కూతురు ఉన్నారు అని అనడం రేణుకు నచ్చలేదు . దాంతో తను రియాక్ట్ అయ్యారు. నేను ఎలా దురదృష్ట వంతురాలినో చెప్తారా.. తెలుసుకోవాలని ఉంది అని రేణు సమాధానం ఇచ్చారు. ఈ కామెంట్ ను స్క్రీన్ షాట్ తీసి తన ఇన్ స్టాలో పోస్టు చేశారు. నా జీవితంలో లేని దాని గురించి బాధపడకుండా.. ఉన్న దాంతో సంతోషంగా ఉన్నా అంటూ రేణు దేశాయ్ తెలిపారు. ఇలాంటి జీవితం దొరకడం నా అదృష్టంగా బావిస్తున్నా అంటోంది అన్న రేణు దేశాయ్. మనిషిని టాలెంట్ తో గుర్తించాలి కాబట్టి మీ మైండ్ సెట్ మార్చుకోవాలి అంటు సలహా ఇచ్చారు.

# వర్షా కాలంలో కూరగాయల విషయంలో జాగ్రత్త!

**విశ్వంభర, ఫీచర్:** వర్షాకాలం వచ్చేసింది చాలా చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుంది. ఇక కాలువలు, డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తున్నాయి. హైదరాబాదులో అయితే చెప్పనవసరం లేదు ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఇలాంటి సమయంలో కొన్ని రకాలైన ఆహార పదార్థాలు తింటే రోగాల బారిన పడటం ఖాయం అంటున్నారు వైద్యులు. వర్షాకాలంలో ఎటువంటి ఫుడ్ తినకూడదు ఇప్పుడు తెలుసుకుందాము. వర్షం వచ్చిందంటే చాలు ఈగలు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో జలుబు, ఫ్లూ, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ వంటి సమస్యలు వస్తాయి. కొన్ని రకాల వ్యాధులు దోమల ద్వారా వస్తే మరికొన్ని ఇన్ఫెక్షన్ల వల్ల వస్తున్నాయి. ఇలాంటి సమయంలో మనం తినే ఆహారంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రోగాలు బారిన పడక తప్పదంటున్నారు వైద్య నిపుణులు. సహజంగా వర్షాకాలం సీజన్లో బ్యాక్టీరియా ఎక్కువగా వృద్ధి చెందుతాయి. ఈ కాలంలో కొన్ని ఆహారాలు అనారోగ్యానికి గురిచేస్తాయి. వీటికి వీలైనంత దూరంగా ఉండాలని చెప్తున్నారు వైద్యులు. ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే వర్షాకాలంలో వాటిని తినడం తగ్గించాలి. ఎందుకంటే ఈ సీజన్లలో ఆకుకూరలు పండించే ప్రదేశాలు అపరిశుభ్రంగా మారుతాయి. చిత్తడి నేలల్లో వీటిని పండిస్తారు కనుక వీటిపై సరైన శ్రద్ధ తీసుకోరు. ఆకుకూరలకు బురద అంటుకొని ఉంటుంది. అప్పుడు బ్యాక్టీరియా వాటిపై చేరి అనేక సీజన్ వ్యాధులు ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుంది. ఈ సీజన్లో బ్రోకలీ, క్యాబేజీ క్యాలీఫ్లవర్ వంటి వెజిటబుల్స్‌పై పురుగులు ఉండే అవకాశం కూడా ఎక్కువగానే ఉంటాయి. తడి వాతావరణంలో క్యాబేజీ ఉంటే ఆ కూరల్లో బ్యాక్టీరియా పెరిగే అవకాశాలు ఉంటాయి. వాటిని తినడం వల్ల అనేక వ్యాధుల బారినపడే అవకాశం ఉంటుందంటున్నారు డాక్టర్లు.



# స్త్రీలా..? పురుషులా..? ఎవరికి గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువ?

విశ్వంభర, ఫీచర్:

ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అలాంటి వాటిల్లో సైలెంట్ కిల్లర్ గుండెపోటు ఒకటి.. ఇటీవల చాలా మరణాలు గుండెపోటుతోనే సంభవిస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే విషయంగా వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండెపోటు గుండె కండరాలకు తగినంత రక్తం, ఆక్సిజన్ అందనప్పుడు సంభవించే తీవ్రమైన ఆరోగ్య పరిస్థితి. ఇది సాధారణంగా కరోనరీ ఆర్టరీ అని పిలవబడే.. గుండె సిరలలో అడ్డుపడటం వలన సంభవిస్తుంది. అయితే, మహిళల కంటే పురుషులకు గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందనేది సాధారణ నమ్మకం. కానీ, ఇది పూర్తిగా నిజం కాదు. అదే సమయంలో గుండెపోటు లక్షణాలు, ప్రమాద కారకాలు పురుషులు, స్త్రీలలో కొద్దిగా భిన్నంగా ఉండవచ్చు. అవేంటో వివరంగా అర్థం చేసుకోండి..



**మహిళల్లో గుండెపోటు ప్రమాద కారకాలు..**

55 ఏళ్లు పైబడిన మహిళల్లో గుండెపోటు ముప్పు పెరుగుతుంది. కుటుంబ చరిత్ర: మీ కుటుంబంలో ఎవరికైనా గుండెపోటు లేదా స్ట్రోక్ చరిత్ర ఉంటే, మీ గుండెపోటు ప్రమాదం కూడా పెరుగుతుంది. గుండె జబ్బులకు అధిక రక్తపోటు ప్రధాన ప్రమాద కారకం. మధుమేహం గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు సిరల్లో ఫలకం పేరుకుపోవడానికి కారణమవుతాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. ధూమపానం గుండె జబ్బులకు ప్రధాన ప్రమాద కారకం. ఊబకాయం గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయకపోవడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. ఒత్తిడి వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక ఆరోగ్య సమస్యలు గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. కొన్ని రకాల గర్భనిరోధక మాత్రలు గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి.

**పురుషులలో గుండెపోటు ప్రమాద కారకాలు**

45 ఏళ్లు పైబడిన పురుషులలో గుండెపోటు ముప్పు పెరుగుతుంది. మీ కుటుంబంలో ఎవరికైనా గుండెపోటు లేదా స్ట్రోక్ చరిత్ర ఉంటే, మీ గుండెపోటు ప్రమాదం కూడా పెరుగుతుంది. గుండె జబ్బులకు అధిక రక్తపోటు ప్రధాన ప్రమాద కారకం. మధుమేహం గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు సిరల్లో ఫలకం పేరుకుపోవడానికి కారణమవుతాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. గుండె జబ్బులకు ధూమపానం ప్రధాన ప్రమాద కారకం. ఊబకాయం గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయకపోవడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. ఒత్తిడి వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.

**గుండెపోటు ప్రారంభ లక్షణాలు**

ఛాతీ నొప్పి, ఒత్తిడి లేదా బిగుతుగా ఉండటం. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. వికారం లేదా వాంతులు. చల్లని చెమటలు పట్టడం.. మైకము లేదా తలతిరగడం. దవడ, మెడ లేదా చేయి నొప్పి. గుండెపోటు అనేది పురుషులు, మహిళలు ఇద్దరికీ తీవ్రమైన ఆరోగ్య ముప్పు. ప్రారంభ సంకేతాలను తెలుసుకోవడం, వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం. గుండె జబ్బుల ప్రమాద కారకాలను నియంత్రించడం ద్వారా, మీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించవచ్చు.. ఇంకా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com